మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

ప్రజా మంటలు

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 71 వెల - రూ 5:00

తెలంగాణ జాతీయ దినపత్రిక

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri

లోక్‌సభలో 12 సీట్లు గెలుస్తాం

సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తి కర వ్యాఖ్యలు

హైదరాబాద్, (ప్రజా మంటలు):
సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తి కర వ్యాఖ్యలు చేశారు. లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ 12సీట్లు గెలుస్తున్నాం...నాలుగు కేంద్ర మంత్రి పదవులు వస్తాయని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం లోక్ సభ ఎన్నికల సుదీర్ఘ పక్రియ ముగియడంతో సర్వే సంస్థలు తమ ఎగ్జిట్ పోల్స్ వెల్లడించాయి. లోక్ సభ ఎన్నికల్లో గెలుపు ఎవరిది..ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి..రాష్ట్రాల వారీగా ఎగ్జిట్ పోల్స్ సంస్థలు తమ సర్వే రిపోర్టులను చెబుతు న్నాయి. ఎగ్జిట్ పోల్స్ ప్రకారం.. తెలంగాణలో కాంగ్రెస్ కు అధిక సీట్లు వస్తాయని తెలుస్తోంది. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ఈ ఆసక్తి కర వ్యాఖ్యలు చేశారు.

ఎన్డీయే హవా!

వెల్లడించిన ఎగ్జిట్ పోల్స్

ఎగ్జిట్ పోల్స్‌లో మోడీకే మూడోసారి పట్టం

అదే సందర్భంలో పుంజుకున్న ఇండియా కూటమి

బలమైన ప్రతిపక్షంగా చేరుకోనున్నట్టు అంచనాలు

400 సీట్లు సాధించడం బీజేపీ కల్ల..

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
దేశంలో మరోసారి మోదీ ప్రభంజనం ఖాయమని మెజార్టీ సర్వే సంస్థలు అంచనా వేశాయి. గతంలో మాదిరిగానే దేశవ్యాప్తంగా మోదీ గాలి వీచిందని స్పష్టం చేశాయి. తమిళనాడు, కేరళలో ప్రతిపక్ష ఇండియా కూటమి దాదాపుగా క్లీన్ స్వీప్ చేస్తుందని సర్వే సంస్థలు వెల్లడించాయి. బీజేపీ అంచనాలకు తగ్గట్లే ఫలితాలు వస్తాయన్న సర్వే సంస్థలు ఇండియా కూటమి మరోసారి ప్రతిపక్ష పాత్రకే పరిమితం అవుతుందని వెల్లడించాయి.

-: వివిధ సంస్థల ప్రీపోల్ సర్వేలు :-

సంస్థ పేరు	ఎన్డీయే	ఇండియా	ఇతరులు
ఇండియా న్యూస్ -డీ డైనమిక్స్	362-392	141-161	10-20
జన్‌కీ బాత్	353-368	118-33	43-48
రిపబ్లిక్ టీవీ-పీమార్క్	359	154	30
ఆర్బీ- మాట్రిజ్	371	125	47
న్యూస్ నేషన్	342-378	153-169	21-23
దైనిక్ భాస్కర్	281-350	145-201	33-49

ఎన్‌డీఏ కూటమికి 350కుపైగా స్థానాలు వస్తాయని అంచనా వేసిన సంస్థలు ప్రతిపక్ష ఇండియా కూటమి 150 స్థానాల్లోపే పరిమితం అవుతుందని వివరించాయి. దాదాపు అన్ని సంస్థలు నంబర్ అటుఇటుగా ఎన్‌డిఎకు మరోమారు ప్రజలు పట్టం కట్టారని వెల్లడించాయి. అదే సందర్భంలో కాంగ్రెస్ గతం కన్నా భారీగా సీట్లను సంపాదించుకుంది. ఇండియా కూటమి కూడా గణనీయంగా సీట్లు సంపాదించి గట్టి ప్రతిపక్షంగా రాబోతోందని ఫలితాలు వెల్లడిస్తున్నాయి. ఇకపోతే ఈ దఫా 400 సీట్లు అన్న బిజెపి కలలు మాత్రం నెరవేరేలా కనిపించడం లేదు. దేశం ఉత్కంఠగా ఎదురు చూస్తున్న సార్వత్రిక ఎన్నికల ఫలితాలకు సంబంధించి శనివారం సాయంత్రి వివిధ సంస్థలు తమ సర్వేలను ప్రకటించాయి. వివిధ సర్వే సంస్థలు, మీడియా సంస్థలు ఎగ్జిట్ పోల్స్ విడుదల చేసాయి. వివిధ సర్వేలు ప్రజల అభిప్రాయాలను సేకరించి వాటన్నిటి ఆధారంగా దేశంలో ఎవరు అధికారంలోకి రానున్నారో అంచనా వేశాయి. ముచ్చటగా మూడో సారి కూడా ఎన్డీఏ కూటమి అధికారం చేపడుతుందని దాదాపు అన్ని సర్వేల ఫలితాలు చెబుతున్నాయి. ఎన్డీఏ కూటమి గరిష్టంగా 390 స్థానాల్లో గెలిచే అవకాశాలు ఉన్నాయి. రిపబ్లిక్ - పీమార్క్, ఇండియా న్యూస్ డీ వెల్లడించింది. డైనమిక్స్, రిపబ్లిక్ భారత్ మ్యాట్రిజ్ చేసిన సర్వేలు 300 పైగా స్థానాలు కమలం పార్టీ గెలుస్తుందని చెబుతున్నాయి. సుదీర్ఘంగా ఏడు దశల్లో సాగిన సార్వత్రిక ఎన్నికల సమరం తుది పోలింగ్ శనివారం ముగిసింది. దీంతో ఎగ్జిట్ పోల్స్ వెలువడ్డాయి. మెజారిటీ

మిగతా 2లో..

ఇండియా కూటమికి 295 సీట్లు ఖాయం

కూటమి నేతలతో సమావేశంలో ఖర్గే ధీమా

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండియా' కూటమికి 295 సీట్లకు పైగా వస్తాయని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తెలిపారు. 'ఇండియా' కూటమి పార్టీల నేతలతో శనివారం సమావేశానంతరం వారంతా గ్రూప్ ఫోటో దిగారు. అనంతరం ఖర్గే మాట్లాడుతూ, తమ కూటమికి 295కి పైగానే సీట్లు వస్తాయని, ఆ సంఖ్య కూడా దాటవచ్చని, అంతకంటే మాత్రం తగ్గవని చెప్పారు. ప్రజలు ఇచ్చిన సమాచారం, ప్రజల సర్వే ఆధారంగా తాము ఈ విషయం చెబుతున్నామని అన్నారు. ప్రభుత్వ సర్వేలపై మాట్లాడుతూ, ప్రభుత్వాలకు సర్వేలు కూడా ఉంటాయని, సర్వేలకు వాళ్లకు (బీజేపీ) చాలా మార్గాలుంటాయని, మీడియా కూడా వారి పాక్షిక సత్యాలను హైలైట్ చేస్తుంటాయని అన్నారు. తమ కూటమి ఐక్యంగా ఉందని, ఇకముందు కూడా ఐక్యత ఇలాగే కొనసాగుతుందని, తమ ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నాలు ఎవరూ చేయలేరని చెప్పారు.

చురుకుగా రుతుపవనాల కదలిక

కేరళలో విస్తారంగా వర్షాలు

విరిగిపడుతున్న కొండచరియలు

ఆరు జిల్లాల్లో ఎల్లో అలర్ట్ జారీ

2లో..

అత్యధికంగా 52.9 డిగ్రీల ఉష్ణోగ్రత

అత్యధిక ఉష్ణోగ్రతలపై విచరాణ

సెన్సర్ లోపాన్ని గుర్తించిన అధికారులు

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
ఈ ఏడాది భానుడి ప్రతాపానికి దేశ ప్రజలు అల్లాడిపోయారు. ఇటీవల దిల్లీ లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ముంగేశ్‌పుర్‌లో వాతావరణ స్టేషన్‌లో అత్యధికంగా 52.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు చూపించింది. దీనిపై తాజాగా కేంద్రం స్పందించింది. దానికి సెన్సార్ సరిగా పని చేయకపోవడమే కారణమని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు.

మిగతా 2లో..

ప్రశాంతంగా ముగిసిన సార్వత్రిక ఎన్నికలు

4లో..

ముగిసిన మోడీ ధ్యానముద్ర

తిరువళ్లూరు విగ్రహం వద్ద నివాళి

ఢిల్లీకి తిరుగు ప్రయాణం



కన్యాకుమారి,జూన్1 (ప్రజా మంటలు):
తమిళనాడులోని కన్యాకుమారిలో స్వామి వివేకానంద శిలాస్మారకం వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన సుదీర్ఘ ధ్యానం ముగిసింది. గురువారం సాయంత్రం ప్రారంభమైన ధ్యానం.. 45 గంటలపాటు కొనసాగింది. ఈ క్రమంలోనే ఉదయం సూర్యుడికి అర్ఘ్యం వదిలారు. ధ్యానం ముగిసిన అనంతరం ప్రముఖ తమిళ కవి, తత్వవేత్త తిరువళ్లువర్ విగ్రహానికి మోదీ పూలమాల వేసి, నివాళులర్పించారు. వివేకానంద శిలాస్మారకం పక్కనే చిన్న దీవిపై ఏర్పాటుచేసిన 133 అడుగుల ఎత్తయిన ఈ భారీ విగ్రహం వద్దకు ఆయన పడవలో చేరుకున్నారు. అనంతరం కన్యాకుమారి తీరానికి తిరిగివచ్చారు. సార్వత్రిక ఎన్నికల ప్రచార గడువు ముగిసిన వెంటనే పంజాబ్ నుంచి వెనుదిరిగిన మోదీ.. తమిళనాడులోని భగవతి అమ్మన్ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం శిలాస్మారకాన్ని చేరుకుని, ధ్యాన పక్రియను ప్రారంభించారు. 131 ఏళ్ల క్రితం స్వామి వివేకానంద కూడా ఇక్కడ ధ్యానం చేశారు. 2019లో ఎన్నికల సమయంలో మోదీ కేదార్‌నాథ్ వద్ద గుహల్లో ధ్యానం చేసిన విషయం తెలిసిందే.

ప్రజా నాడి



బిఆర్ఎస్ క్యాండిల్ ర్యాలీ

గన్‌పార్క్ వద్ద ప్రారంభించిన కెసిఆర్

హైదరాబాద్, (ప్రజా మంటలు):
బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు ప్రారంభ మయ్యాయి. హైదరాబాద్ గన్‌పార్క్ వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ క్యాండిల్ ర్యాలీని ప్రారంభించారు. గన్‌పార్క్‌లోని తెలంగాణ అమరవీరుల స్థూపం నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం ఎదురుగా ఉన్న అమరజ్యోతి వరకు క్యాండిల్ ర్యాలీ కొనసాగనుంది.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు, జంట నగరాల పార్టీ శ్రేణులతో భారీ ఎత్తున ఈ కార్యక్రమాన్ని హాజరయ్యారు. ఇదిలావుంటే అంతకుముందు కేసీఆర్ ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకున్నారు. శనివారం సాయంత్రం లక్డీకపూల్ వద్ద భారీగా ట్రాఫిక్ స్తంభించింది. గన్‌పార్క్ దగ్గర తన కోసం

మిగతా 2లో..

ఎపిలో వైసిపికే మళ్లీ ప్రజల తీర్పు

ఆరా, పార్థా సంస్థల ఎగ్జిట్ పోల్ అంచనాలు

అమరావతి,జూన్1 (ప్రజా మంటలు):
ఏపీలో అసెంబ్లీ, పార్లమెంట్‌కు జరిగిన ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీనే గెలుస్తుందని ఆరా సర్వే సంస్థ యజమాని మస్తాన్ వెల్లడించారు. ఏపీలో హోరాహోరీగా సాగిన పోలింగ్ లో.. వైసీపీదే ఆధిక్యం అని.. ఈ విషయం 22 రోజుల పరిశీలన తర్వాత అంచనాకు వచ్చినట్లు వెల్లడించారు. పార్థా సంస్థ కూడా ఇదే విషయాన్ని వెల్లడించింది. వైసిపి అధికారంలోకి వస్తోందిన వెల్లడించింది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి 94 నుంచి 104 సీట్లతో మళ్లీ జగన్ అధికారంలోకి వస్తున్నట్లు మస్తాన్ చెప్పారు. టీడీపీ కూటమి 71 నుంచి 81 మధ్య సీట్లను గెలుస్తుందని వెల్లడించారాయన. టీడీపీ కూటమి కంటే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి అదనంగా 25 సీట్లు రాబోతున్నాయని సర్వేలో వెల్లడైనట్లు ఆరా మస్తాన్ వివరించారు. ఇక పార్లమెంట్ సీట్ల విషయానికి వస్తే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 13 నుంచి 15 లోక్ సభ సీట్లలో గెలుస్తుందని చెప్పిన ఆరా మస్తాన్.. టీడీపీ కూటమి 10 నుంచి 12 సీట్లలో గెలవబోతుందని వివరించారాయన. జనసేన పార్టీ పోటీ చేసిన రెండు పార్లమెంట్ సీట్లలో ఆ పార్టీనే విజయం సాధిస్తుందని వివరించారు. వైఎస్ షర్మిల ఆధ్వర్యంలోని కాంగ్రెస్ పార్టీ ఓట్లను భారీ చీల్చిందని.. దీని వల్ల మూడు పార్లమెంట్ సీట్లను వైసీపీ కోల్పోవాల్సి వస్తుందని.. ఇది ఆ పార్టీకి నష్టం చేకూర్చిందన్నారు. కొంచెం అటుఇటుగా పార్థా సంస్థ కూడా వైసిపికే మళ్లీ అధికారం అని పేర్కొంది.

మొదటి పేజీ తరువాయి

బిఆర్ఎస్ క్యాండిల్ ర్యాలీ

గన్‌పార్క్ వద్ద ప్రారంభించిన కెసిఆర్

వేచి చూస్తున్న పార్టీ నేతల వద్దకు బంజారాహిల్స్ నందీనగర్ నుంచి బయల్దేరి వెళ్లగా లక్డీకపూల్ ట్రాఫిక్‌లో ఆయన చిక్కుకున్నారు. దాదాపు అరగంటకుపైగా ఆయన ట్రాఫిక్‌లోనే ఉన్నట్లు తెలుస్తోంది. తెలంగాణ దశాబ్ది ఉత్సావ వేడుకలను ఘనంగా నిర్వహించడానికి బీఆర్ఎస్ సిద్ధమైంది. 10 ఏళ్లుగా అధికార పార్టీ హోదాలో వేడుకలు నిర్వహించగా.. రాష్ట్రావిర్భావం తరువాత తొలిసారి ప్రతిపక్ష హోదాలో కార్యక్రమం జరుపుతోంది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు క్యాండిల్ ర్యాలీ నిర్వహించనున్నారు. ర్యాలీలో కేసీఆర్ పాల్గొననుండటంతో ఆ పార్టీ శ్రేణులు భారీగా గన్ పార్క్ వద్దకు చేరుకుంటున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, ప్రజాప్రతినిధులు తదితర ముఖ్య నేతలు గన్ పార్క్ వద్దకు చేరుకున్నారు. కేసీఆర్, బీఆర్ఎస్ నేతలు అమరవీరుల స్థూపానికి నివాళి అర్పించనున్నారు. అనంతరం గన్ పార్క్ నుంచి సచివాలయం వద్ద ఉన్న అమరవీరుల స్మారక చిహ్నం వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించ నున్నారు. ఈ కార్యక్రమానికి హాజరుకావడానికి వస్తుండానే కేసీఆర్ లక్డీకపూల్ ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు.

చురుకుగా రుతుపవనాల కదలిక

తిరువనంతపురం,జూన్1(ప్రజా మంటలు):కేరళ తీరాన్ని నైరుతి రుతుపవనాలు తాకిన రెండ్రోజులకు రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాయి. దీంతో పలు జిల్లాల్లో వర్షాలు దంచి కొడుతున్నాయి. దక్షిణ కేరళలో కొండచరియలు విరిగిపడటం, చెట్లు కూలడంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. గంటల తరబడి కురుస్తున్న వర్షాలకు కొట్టాయం, ఇడుక్కి జిల్లాల్లోని హై-రేంజ్ ప్రాంతాల్లో వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. త్రిసూర్ జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో కేరళలోని పలు జిల్లాలకు భారత వాతావరణ శాఖ సెంట్రల్ జిల్లా త్రిసూర్, ఉత్తర జిల్లాలైన మలప్పురం, కోజికోడ్‌లకు శనివారం రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఇడుక్కి, పాలక్కాడ్, వాయనాడ్‌లకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించగా, ఆరు జిల్లాల్లో ఎల్లో అలర్ట్ జారీ చేశారు. రానున్న 24 గంటల్లో రెడ్ అలర్ట్ జారీ చేసిన ప్రాంతాల్లో 20 సెం.మీ కంటే భారీ వర్షపాతం నమోదవుతుందని అధికారులు తెలిపారు. ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన ప్రాంతాల్లో 11 సెం.మీ నుండి 20 సెం.మీ వరకు వర్షం కురుస్తుందని.. ఎల్లో అలర్ట్ జారీ చేసిన ఏరియాల్లో 6 సెం.మీ నుంచి11 సెం.మీ వర్షపాతం నమోదవుతుందని చెప్పారు. ఇడుక్కిలో కొండచరియలు విరిగిపడటంతో ఇళ్లు, వాహనాలు దెబ్బతిన్నాయి. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని స్థానికులు తెలిపారు.పంటలు ధ్వంసమయ్యాయని వెల్లడించారు. 'ఇంత భయంకర పరిస్థితిని ఎన్నడూ చూడలేదు. భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయి. బండరాళ్లు జారీ కిందకు పడ్డాయి. చెట్లు ఎగిరి మాపైకి వస్తున్నట్లు అనిపించింది' అని ఓ గ్రామస్థుడు భయానక అనుభవాన్ని గుర్తు చేసుకున్నాడు. కొండ ప్రాంతంలో నివాసముంటున్న ఓ ఇంటిపై రాళ్లు పడ్డాయి. కుటుంబ సభ్యులు అప్రమత్తం కావడంతో తృటిలో ప్రాణాపాయం తప్పింది. అనంతరం వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. ప్రమాదకర తొడుపుజా-పులియన్మల రహదారిపై ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు కోరుతున్నారు.

అత్యధికంగా 52.9 డిగ్రీల ఉష్ణోగ్రత

ఈమేరకు ఎక్స్ వేదికగా వెల్లడించారు. మే 29న ముంగేశ్‌పుర్‌లో 52.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీనిపై భారత వాతావరణ విభాగం విచారణ జరిపింది. మూడు డిగ్రీల సెన్సర్ ఎర్రర్‌ను అధికారులు గుర్తించారు. సిబ్బంది దిద్దుబాటు చర్యలు చేపట్టారు. కచ్చితమైన ఉష్ణోగ్రతల సమాచారం ఇచ్చేందుకు మేం కృషి చేస్తున్నాం' అని మంత్రి తెలిపారు. ఈ రికార్డు ఉష్ణోగ్రతపై ఇటీవల ఐఎండీ డైరెక్టర్ జనరల్ ఎం.మహాపాత్ర స్పందించిన సంగతి తెలిసిందే. సెన్సర్ పనితీరును పరిశీలిస్తున్నట్లు అప్పుడు చెప్పారు. దిల్లీలో ఉష్ణోగ్రతలు కొలిచేందుకు 20 చోట్ల మానిటరింగ్ స్టేషన్లు ఏర్పాటుచేశామని, అందులో ముంగేశ్‌పుర్‌లో అత్యధికంగా 52.9 డిగ్రీల సెల్సియస్ నమోదైనట్లు చూపించిందన్నారు. ఈ స్థాయిలో ఉష్ణోగ్రత ఇప్పటివరకు నమోదు కాలేదన్నారు. దిల్లీలో ఏర్పాటుచేసిన వాతావరణ కేంద్రాల్లో 14 చోట్ల ఉష్ణోగ్రతలు తగ్గాయని, కొన్నిచోట్ల 45-50 మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని తెలిపారు. మిగతా వాటితో పోలిస్తే ముంగేశ్‌పుర్‌లో నమోదైన డేటా భిన్నంగా ఉందన్నారు. సెన్సర్‌లో సమస్యే అందుకు కారణమని తాజాగా వెల్లడైంది.

ఎన్డీయే హవా

ఎగ్జిట్ పోల్స్ మళ్లీ ఎన్డీయేనే ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఊహిస్తున్నాయి. వరుసగా మూడోసారి మోదీ ప్రధాని పదవిని అధిరోహిస్తారని చెబుతున్నాయి. రిపబ్లిక్-పీ మార్క్, ఇండియా న్యూస్- డీ డైనమిక్స్, రిపబ్లిక్ భారత్ మొదలైన సర్వే సంస్థలు ఎన్డీయే కూటమి 350కి పైగా స్థానాలు సంపాదిస్తుందని ప్రకటించాయి. రిపబ్లిక్ భారత్-పి మార్క్ అంచనా ప్రకారం ఎన్డీయే 359 సీట్లు, ఇండియా కూటమి 154, ఇతరులు 30 సీట్లు గెలుచుకుంటారు. రిపబ్లిక్-మాట్రిజ్ ప్రకారం.. ఎన్డీయే 353-368 సీట్లు, ఇండియా కూటమి 118, ఇతరులు 43-48 సీట్లు గెలుచు కుంటారు. ఇండియా న్యూస్-డి-డైనమిక్స్ అంచనా ప్రకారం.. ఎన్డీయే 371 సీట్లు, ఇండియా కూటమి 125 సీట్లు, ఇతరులు 47 సీట్లు గెలుచుకుంటారు. అలాగే జన్‌కీ బాత్ సర్వే కూడా ఎన్డీయేకే ఓటు వేసింది. ఆ సర్వే ప్రకారం.. ఎన్డీయే 362-392 సీట్లు, ఇండియా కూటమి 141-161 సీట్లు, ఇతరులు 10-20 సీట్లు గెలుచుకుంటారు. ఎన్డీటీవీ పోల్స్ ఆఫ్ పోల్స్ ప్రకారం ఎన్డీయే 365 సీట్లు, ఇండియా కూటమి 142 సీట్లు, ఇతరులు 36 సీట్లు గెలుచుకుంటారు. టీవీ9 పోల్ స్ట్రాట్, పీపుల్స్ ఇన్‌సైట్ ఎగ్జిట్ పోల్స్ 2024 ఫలితాలను విడుదల చేసింది. దేశ వ్యాప్తంగా జరిగిన లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పార్లమెంట్ స్థానాలకు సంబంధించి సంచలన సర్వే విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని 25 పార్లమెంట్ నియోజకవర్గాలతో పాటు తెలంగాణలోని 17 లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించిన అంచనాలను విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ లోని 25 లోక్ సభ స్థానాలకు ఎన్డీయే కూటమికి 12 స్థానాలు స్తాయని అంచానా వేసింది. అందులో తెలుగుదేశం పార్టీకి 9 స్థానాలు కైవసం చేసుకోగా.. జనసేనకు 1, బీజేపీకు 2 స్థానాలు వస్తాయని పేర్కొంది. ఇక ప్రస్తుతం అధికారంలో ఉన్న వైఎస్ఆర్సీపీకి 13 స్థానాలు వస్తాయని తెలిపింది. తెలంగాణలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు 8 సీట్లు సాధిస్తుందని తెలిపింది. అలాగే బిజెపికి 7, బీఆర్ఎస్ 1, ఎంఐఎం 1 స్థానంలో విజయం సాధించనున్నట్లు తెలిపింది. ఆరా మస్తాన్ సర్వే ప్రకారం తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి 6 నుంచి 8 పార్లమెంట్ స్థానాలు వస్తాయన్నారు. ఇక బీజేపీకు 8 నుంచి 9 పార్లమెంట్ స్థానాలు కైవసం చేసుకుంటుదని తెలిపింది. ఇతరులకు 1 స్థానం అని ప్రకటించింది. అందులో బీఆర్ఎస్, ఎంఐఎంలకు ఎవరికైనా రావొచ్చు అని చెబుతున్నారు. ఇదే ఆరా మస్తాన్ గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఖచ్చితమైన అంచనాలను వెలువరించారు.

గద్వాల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

లారీని వేగంగా ఢీకొన్న స్కార్పియో

ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం

గద్వాల,జూన్1(ప్రజా మంటలు):

జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి చౌరస్తాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శనివారం తెల్లవారుజామున ఎర్రవల్ల చౌరస్తాలోని పెట్రోల్ పంపు వద్ద జాతీయ రహదారిపై కారు, లారీ ఢీకొన్నాయి. దీంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే మరణించారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను కర్నూలు దవాఖానకు తరలించారు. కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ నుంచి హైదరాబాద్ వస్తుండగా ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. మృతుల్లో ఇద్దరు మహిళలు, ఒక చిన్నారి ఉన్నారని చెప్పారు. అంతా ఒకే కుటుంబానికి చెందినవారని వెల్లడించారు. మృతులను వెంకటేశ్ (కారు డ్రైవర్), భార్య పుష్ప (35), తల్లి లత (55), వెంకటేశ్ చె÷-లలెలు కుమారుడు ఆదిత్య (6)గా గుర్తించారు. అతివేగం, నిద్రమత్తు కారణంగానే ప్రమాదం జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎర్రవల్లి చౌరస్తాలోని పెట్రోల్ పంపు దగ్గర జాతీయ రహదారిపై శనివారం తెల్లవారు జామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతి వేగంగా వస్తున్న స్కార్పియో వాహనం లారీని ఢీ కొంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన ప్రదేశానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అలాగే క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

నేడు తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు

గవర్నర్‌ను కలిసి ఆహ్వానించిన సిఎం

ఉదయం గన్‌పార్క్‌లో సిఎం రేవంత్ నివాళి

పరేడ్ గ్రౌండ్‌లో జెండా ఆవిష్కరణ

ప్రజలను ఉద్దేశించి ప్రసంగం

ట్యాంక్‌బండ్‌పై సాంస్కృతిక కార్యక్రమాలు

జయజయహే తెలంగాణ గీతావిష్కరణ

కవులు, కళాకారులు, ఉద్యమకారులకు సన్మానం

హైదరాబాద్,జూన్1(ప్రజా మంటలు):

తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఈ వేడుకల్లో అందరినీ భాగస్వాములను చేయనుంది. గత పదేండ్లలో లేని విధంగా అందరినీ కలుపుకుని, రాజకీయాలకు అతీతంగా ఆవిర్భావ వేడుకలు నిర్వహించాలని రాష్ట్ర సర్కార్ నిర్ణయించింది. ఉదయమే గన్‌పార్క్ వద్ద అమరులకు సిఎం రేవంత్ నివాళి అర్పించి, అక్కడి నుంచి పరేడ్ గ్రౌండ్స్‌లో జెండా ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరిస్తారు. ఈ ఉత్సవాలకు గవర్నర్ రాధాకృష్ణన్‌ను సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటి సిఎం భట్టి విక్రమార్కలు స్వయంగా ఆహ్వానించారు. ముఖ్య అతిథిగా రావాలని సోనియాను ఆహ్వానించినా ఆమె రాక అనుమానమని అంటున్నారు. మరోవైపు తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ పరిసరాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. జూన్ 2న ఉదయం పరేడ్ మైదానంలో జాతీయ జెండా ఆవిష్కరణ, ఇతర కార్యక్రమాలు ఉంటాయి. సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన కళాబృందాలతో ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే ఈ సందర్భంగా జయజయే తెలంగాణ గీతాన్ని సిఎం రేవంత్ జాతికి అంకితం చేయనున్నారు. కళాకారులు, కవులు, ఉద్యమకారులను సన్మానించానున్నారు. ఇకపోతే గత ప్రభుత్వం 2014 నుంచి 2023 దాకా పదేండ్లలో ఒక్కసారి కూడా ఉద్యమకారులను ఆవిర్భావ వేడుకలకు ఆహ్వానించలేదు. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆవిర్భావ వేడుకల్లో పాల్గొనాలని ఉద్యమకారులందరికీ ఆహ్వానం పంపించింది. కలెక్టర్ల ద్వారా ఆహ్వానాలు వెళ్లాయి. ఆవిర్భావ వేడుకల్లో ఆదివారం ఉదయం పరేడ్ గ్రౌండ్‌లో పోలీసుల కవాతు ఉంటుంది. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రజలను ఉద్దేశించి మాట్లాడతారు. సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. కార్నివాల్, లేజర్ షో లాంటి కార్యక్రమాలతో పాటు ఫుడ్, గేమింగ్ స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ట్యాంక్ బండ్ పై జాతీయ జెండాలతో మార్చ్-ఫాస్ట్ కూడా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలకు సీఎం రేవంత్, మంత్రులు, ఇతర ప్రముఖులు హాజరుకానున్నారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు సోనియా రావడం లేదని తెలుస్తోంది. అంతకంటే ముందే ఈ అంశం రాజకీయ ప్రకంపనలు సృష్టించింది. సోనియా ఆహ్వానాన్ని బీజేపీ నేతలు తప్పుబట్టారు. అయితే తెలంగాణ దేవత అయిన సోనియాను ఎందుకు ఆహ్వానించకూడదని ప్రశ్నించారు అధికార పార్టీ నేతలు. చివరికి వ్యక్తిగత కారణాలతో సోనియా గాంధీ తెలంగాణ పర్యటన రద్దు అయ్యింది. జూన్ 2న తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెట్టి సర్కార్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఆవిర్భావ వేడుకలకు సోనియాను ఆహ్వానించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో జరిగిన భేటీలో కేబినెట్ నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీని ఢిల్లికి వెళ్లి ముఖ్య అతిథిగా రావాలంటూ ఆహ్వానించారు సీఎం రేవంత్ రెడ్డి. అయితే ఈ వేడుకలకు సోనియా గాంధీ హాజరు కావడం లేదని ఏఐసీసీ తెలిపింది. అనారోగ్యం కారణాలతో సోనియా గాంధీ తెలంగాణ పర్యటన రద్దు చేసుకున్నట్లు పేర్కొంది. కాగా, షెడ్యూల్ ప్రకారం ఆదివారం సోనియా గాంధీ తెలంగాణకు రావాల్సి ఉంది. వైద్యుల సూచన మేరకు తెలంగాణ పర్యటనకు రాలేకపోతున్నట్లు వెల్లడించారు. తెలంగాణ 10 ఏళ్ల ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఈ నేపథ్యంలో పలువురు ప్రముఖులను ఆహ్వానిస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రాజ్ భవన్ వెళ్లి రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు రావాలని గవర్నర్‌కు సీఎం, డిప్యూటీ సీఎం పూల బోకే ఇచ్చి మర్యాద పూర్వకంగా ఆహ్వానించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరగనున్నాయి. దీంతోపాటు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని ప్రధాన ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని పోలీసులు ప్రకటించారు. ఈ ఆంక్షలు శనివారం ఉదయం నుంచి ఆదివారం రాత్రి 12 గంటల వరకు కొనసాగుతాయని వెల్లడించారు. గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌తో రాజ్‌భవన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క భేటీ అయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ఆయన్ను ఆహ్వానించారు.

జానా, కెకెలతో పొన్నం భేటీ

ఉద్యమం నాటి సంగతులపై చర్చ

హైదరాబాద్,జూన్1(ప్రజా మంటలు):

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జానారెడ్డితో పాటు కేశవరావుతో మంత్రి పొన్నం ప్రభాకర్ మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వెంట చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామి, మాజీ ఎంపీ రాజయ్య ఉన్నారు. తెలంగాణ ఉద్యమంలో నాటి పోరాటాలను జానారెడ్డి , కేశవరావుతో కలిసి గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకలను ఈ సారి కాంగ్రెస్ ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోంది. ఉదయం, సాయంత్రం రెండు పూటలా వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఉదయం పరేడ్ గ్రౌండ్ లో.. సాయంత్రం ట్యాంక్ బండ్ పై వేడుకలు జరగనున్నాయి. ఆవిర్భావ వేడుకలకు ముఖ్య అతిథిగా సోనియా గాంధీ రానున్నారు. ఆవిర్భావ వేడుకల సందర్భంగా పరేడ్ గ్రౌండ్, ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మరో వైపు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ కు స్వాగతం పలికిన దేశిని కోటి

జమ్మికుంట జూన్ 01 (ప్రజామంటలు): శనివారం రాష్ట్ర రవాణ, బి.సి సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ అమెరికా పర్యటనను విజయవంతంగా పూర్తి చేసుకొని నేడు స్వదేశానికి వస్తున్న సందర్భంగా శనివారం తెల్లవారు జామున హైదారాబాద్ ఎయిర్ పోర్టుకు వెళ్లి స్వాగతం పలికిన జమ్మికుంట మున్సిపల్ వైస్ చైర్మన్ దేశిని స్వప్న కోటి, కౌన్సిలర్ బొంగోని వీరన్న, మాజీ సర్పంచ్ జిల్లెల్ల తిరుపతి రెడ్డి స్వదేశాగమన శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్చం అందజేశారు.

రాష్ట్రావతరణ వేడుకల సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణ

ట్యాంక్‌బండ్, పరేడ్‌గ్రౌండ్ ప్రాంతాల్లో ఆంక్షలు

నగర పోలీస్ కమిషనర్ కె.శ్రీనివాస్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,జూన్1(ప్రజా మంటలు):

రాష్ట్రావతరణ వేడుకల సందర్భంగా ట్యాంక్‌బండ్, పరేడ్‌గ్రౌండ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలుంటాయని నగర పోలీస్ కమిషనర్ కె.శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ట్యాంక్‌బండ్ పై శనివారం ఉదయం నుంచి ఆదివారం రాత్రి 12 గంటల వరకు, గన్‌పార్క్ వద్ద ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 10గంటల వరకు, పరేడ్‌గ్రౌండ్ పరిసరాల్లో ఆదివారం ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు వాహనాల రాకపోకలపై ఆంక్షలుంటాయని తెలిపారు. అప్పర్ ట్యాంక్‌బండ్‌పై శనివారం ఉదయం 6 గంటల నుంచి జూన్ 2 రాత్రి 12 గంటల వరకు వాహనాల రాకపోకలపై ఆంక్షలుంటాయి. నల్లగుట్ట జంక్షన్ నుంచి నెక్లెస్ రోటరీ వైపునకు వచ్చేవాహనాలను రాణిగంజ్ వైపునకు మళ్లిస్తారు. రాణిగంజ్ నుంచి నె÷-లకెస్ రోటరీ వైపునకు వచ్చే వాహనాలను మినిస్టర్ రోడ్ వైపునకు మళ్లిస్తారు. వీవీ స్టాచ్యూ వైపు నుంచి నె÷-లకెస్ రోటరీ వైపునకు వచ్చే వాహనాలను నల్లగుట్ట వైపు నకు పంపుతారు. పాత సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ వైపునుంచి వచ్చేవాహనాలను రవీంద్రభారతి వైపునకు మళ్లిస్తారు. ఇక్బాల్ మినార్ వైపునుంచి వచ్చే వాహనాలను తెలుగుతల్లి ÷÷-లఓల్గ÷వర్ మీదుగా స్టీల్‌బ్రిడ్జి వైపున కు పంపుతారు. లిబర్టీ, బషీర్‌బాగ్ వైపునుంచి వచ్చేవాహనాలను అంబేద్కర్ విగ్రహం నుంచి తెలుగుతల్లి ఫ్లై ఓవర్ వైపునకు మళ్లిస్తారు. బండమైసమ్మ క్రాస్‌రోడ్ నుంచి వచ్చేవాహనాలను ఇందిరాపార్క్ వైపునకు పంపుతారు. కవాడిగూడ వైపునుంచి వచ్చేవాహనాలను బైబిల్ హౌస్, డీబీఆర్ మిల్స్ వైపునకు పంపుతారు. సైఫాబాద్ పాత పోలీస్‌స్టేషన్, రవీంద్రభారతి జంక్షన్ నుంచి వచ్చే వాహనాలను నాంపల్లి టి జంక్షన్ వైపు అనుమతించరు. నాంపల్లి టి జంక్షన్ వైపు నుంచి వచ్చే వాహనాలను ఏఆర్ పెట్రోల్ పంప్ మీదుగా బీజేఆర్ విగ్రహం వైపునకు పంపుతారు. రవీంద్రభారతి, ఏఆర్ పెట్రోల్ బంక్ జంక్షన్‌ల వద్ద భారీగా ట్రాఫిక్ ఉండే అవకాశముంది. బేగంపేట వైపునుంచి సికింద్రాబాద్ వైపునకు వచ్చేవాహనాలను సీటీఓ, టివోలీ, వైఎంసీఏ, సంగీత్ క్రాస్‌రోడ్స్ వైపునకు పంపుతారు. బేగంపేట నుంచి కార్ఖానా వైపునకు వెళ్లే వాహనాలను పాట్నీ, వైఎంసీఏ వైపునకు మళ్లిస్తారు. ఆర్‌పీ రోడ్ వైపునుంచి తిరుమలగిరి వైపు వెళ్లే వాహనాలను ప్యాట్నీ, క్లాక్ టవర్, వైఎంసీఏ వైపు పంపుతారు. సంగీత్ నుంచి బేగంపేట వైపునకు వచ్చేవాహనాలను క్లాక్ టవర్, ప్యారడైజ్ మీదుగా రసూల్‌పురా దారికి పంపుతారు. ఆలుగడ్డబావి వైపు నుంచి తాడ్‌బండ్, బోయినపల్లి వైపు వెళ్లేవాహనాలను సీటీఓ, రాణిగంజ్ వైపునకు పంపుతారు. బోయిపల్లి వైపు నుంచి తివోలీ వైపు వచ్చే వాహనాలను సీటీఓ వైపునకు పంపుతారు. కార్ఖానా, జేబీఎస్, తిరుమలగిరి వైపు నుంచి ప్యాట్నీ వైపునకు వెళ్లే వాహనాలను స్వీకార్ ఉపకార్, వైఎంసీఏ, క్లాక్‌టవర్ వైపునకు పంపుతారు. తివోలి క్రాస్‌రోడ్స్, ఎ÷-లాజా క్రాస్‌రోడ్స్ నుంచి పరేడ్ గ్రౌండ్‌కు వెళ్లే దారిని మూసివేస్తారు. ఆయా రూట్లలో ప్రయాణించే వాహనదారు లు ఈ ఆంక్షలను దృష్టిలో ఉంచుకొని, ప్రత్యామ్నాయ మార్గా ల్లో ప్రయాణించి రద్దీని నివారించాలని సీపీ విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ ఉద్యమాలకు ఊపిరి పోసింది ఇక్కడే?

జగిత్యాల జిల్లా ప్రతినిధి జూన్ 01 (ప్రజామంటలు):
జూన్ 01 తెలంగాణ ఆవిర్భవ ఉత్సవాలు జరుపుకునే ముందు తెలంగాణ పోరాటం ఎక్కడ పురుడు పోసుకుంది, ఎక్కడ మొదలైంది అనే విషయాన్ని ముందు తెలుసుకుందాం. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఈ పేరు వింటే మొదట గుర్తొ చ్చేది తెలంగాణ పోరాటమే. ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమంలో ఉస్మాని యా విశ్వవిద్యా లయం పాత్ర మర్చిపోలే ని. విద్యార్థిలోకం పిడికిలి బిగించి జై తెలంగాణ అంటూ చేసిన నినాదాలు ఢిల్లీని కదిలించాయంటే అందులో అతిశయోక్తి ఏమీ లేదు. నాడు తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోసింది ఉస్మా నియా విశ్వవిద్యాలయే. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పోరాటాల గడ్డ ఉస్మానియా యూనివర్సిటీ, ఎన్నో ఉద్యమాలకు ఊపిరిలూదిన నేల ఇది. ఉద్యమం ఏదైనా పునాది మాత్రమే ఇక్కడే. ఆనాడు స్వరాష్ట్ర సాధనే లక్ష్యంగా మొదలైన తొలి దశ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించింది. 1969 తొలి దశ ఉద్యమం మొదలు 2014లో తెలం గాణ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించే వరకు రణ రంగాన్ని తలపించింది, ఉస్మానియా యూనివర్సిటీ. ఈ ప్రయా ణంలో ఎన్నో గాయాలు, ఉద్యమ సమయంలో ఆ నేలను తాకిన ప్రతి నెత్తుటి చుక్క సాక్షిగా స్వరాష్ట్ర సాధనే ధ్యేయంగా అలుపెరుగని పోరాటం చేసింది.ఆనాడు పోరాడిన ఎందరో విద్యార్థుల త్యాగాల ఫలితమే నేటి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం. కలలు కన్న స్వరాష్ట్ర సాధన కోసం ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ కదనరంగంగా మారింది.తెలంగాణ రాష్ట్ర సాధనకై చేసిన ఆ పోరు రాష్ట్రాన్ని సాధించే వరకు తన తీరు మార్చుకోలేదు.ఉద్యమమేదైనా పునాది మాత్రం ఉస్మానియా యూనివర్సిటీ నుంచే. ఇక్కడే రాష్ట్రం సిద్ధించి దశాబ్దం కాలమవతుంది.సమైక్య పాలనలో తెలంగా ణకు జరుగుతున్న అన్యా యాన్ని మొదటగా గుర్తించిన ఉస్మానియా విద్యార్థి లోకం ఉద్యమబాట పట్టింది.స్థానికులకే సింగరేణిలో ఉద్యోగాలు ఇవ్వాలంటూ 1969 జనవరి 9న పాల్వంచలో అన్నా బత్తుల రవీంద్రనాథ్ చేసిన ఉద్యమానికి ఉస్మానియా యూనివర్సిటీ అండగా నిలిచింది.అదే మొదటి అడుగుగా ప్రారంభమైన ఉద్యమం పల్లె పల్లెకు తెలంగాణ భావజా లాన్ని తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారు ఉస్మాని యా యూనివర్సిటీ విద్యార్థులు.ఈ ఉద్యమానికి ఉద్యోగులు సైతం మద్దతు తెలపడంతో ఉద్యమం ఉగ్రరూపం దాల్చింది.విద్యార్థుల ఉద్యమాన్ని పసిగట్టిన నాటి కాసు బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వం ఉద్యమాన్ని అణచాలని విద్యార్థులపై కాల్పులపై జరిపి, నిర్బంధాన్ని విధించింది. ఫలితంగా 369 మంది విద్యార్థులు అమరు లయ్యారు.ఆ సమయంలో నిప్పుకనికల్లా మండుతున్న విద్యార్థి లోకంపై నాటి సర్కార్ నీళ్లు చల్లింది. కానీ వారిలోని పోరాట పటిమను, స్వరాష్ట్ర కాంక్షను మాత్రం చెరపలేకపోయింది.1976 వరకు తెలగాణ ప్రాంతానికి మొత్తం ఉస్మా నియా విశ్వవిద్యాలయం ఒక్కటే ఉన్నత విద్యాసంస్థ.హైదరాబాద్ ఓయూ క్యాంపస్‌లోని కాలేజీలే కాకుండా కోఠిలోని మహిళా కాలేజీ, సైఫాబాద్ సైన్స్ కాలేజీ, సికింద్రాబాద్ కాలేజీ, వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ దాని అనుబంధ కాలేజీలుగా ఉన్నాయి.తెలంగాణలోని అఫిలి యేటెడ్ కాలేజీలు అన్నీ కూడా ఉస్మానియా విశ్వ విద్యాలయం పరిధిలోకి వచ్చేవి. 1972 కంటే ముందు తెలంగాణ ప్రాంతంలో జరిగిన విద్యార్థి ఉద్యమాలన్నిటికీ కూడా ఉస్మానియా విశ్వవిద్యాలయమే సెంటర్ పాయింట్. ఆ కాలేజీలు ఏర్పడిన తర్వాత ముఖ్యంగా ప్రత్యేక తెలంగాణ తొలి, మలి ఉద్యమాలకైతే గుండెకాయ లాంటిది ఉస్మానియా విశ్వవిద్యాలయం.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

మహాదేవపూర్ జూన్ 01 (ప్రజామంటలు): మండల కేంద్రంలో అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో గుడాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా చాలీసా పారాయణం చేశారు హెూమం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొని స్వామివారితీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ స్వాములు రామ భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

గొల్లపల్లి జూన్ 01 (ప్రజామంటలు):
గొల్లపల్లి మండల కేంద్రంలో శ్రీ అభయ ఆంజనేయ స్వామికి ఆలయంలో శనివారం శ్రీ హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీస్వామివారికి అర్చకులు తిరునహరి సత్యనారాయణ చే విశేష కలశ పంచామృతాభిషేకం, తెల్ల జిల్లడు తమల పాకులుచే పూజ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదంగా నిర్వహించారు. మహిళలు హనుమాన్ దీక్షాపరులు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యాదాద్రి థర్మల్ ప్లాంట్ నిర్మాణంలో అవకతవకలపై విచారణ

హైదరాబాద్,జూన్1(ప్రజా మంటలు):
ల్గొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలో యాదాద్రి థర్మల్ ప్లాంట్ నిర్మాణంలో జరిగిన అవకతవకలపై జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ విచారణ చేపట్టింది. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణంలో అవకతవకలపై జస్టిస్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. విచారణలో భాగంగా యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణ పనులను పరిశీలించి.. అధికారులతో జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి సమావేశమయ్యారు. థర్మల్ పవర్ ప్లాంట్‌లోకి మీడియాను అధికారులు అనుమతించలేదు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి టెండర్లు ఎందుకు పిలవలేదో విచారణ జరిపామని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ విచారణ కమిటీ చీఫ్ జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి వెల్లడించారు. గత ప్రభుత్వం టెండర్లు ప్రకటించకుండా బీహెచ్ఈఎల్‌కు కేటాయించడంపై విచారణ చేశామన్నారు. పవర్ పర్చేజ్ అగ్రిమెంట్లపై కూడా విచారణ జరుగుతుందన్నారు. భద్రాద్రి, యాదాద్రి, పీపీఏల వ్యవహారాల్లో తీసుకున్న నిర్ణయాల వెనక భాగస్వాములైన వారందరికీ నోటీసులు ఇచ్చామన్నారు. ప్రజల అభిప్రాయాలను తీసుకునేందుకు నోటీసులు ఇచ్చామన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలింగ్ తర్వాత నోటీసులు ఇచ్చామన్నారు. అయినప్పటికీ నోటీసులకు మంచి స్పందన వచ్చిందన్నారు. చాలామంది వారి అభిప్రాయాలను మాకు చెప్పారని.. ప్రభుత్వ నిర్దేశించిన సమయంలోపే రిపోర్టు అందజేస్తామన్నారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ఆగస్టులో మొదటి యూనిట్, సెప్టెంబర్‌లో రెండవ యూనిట్.. ఆరు నెలల తర్వాత మిగిలిన యూనిట్ల నుంచి విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని అధికారులు చెప్పారని ఆయన వెల్లడించారు.

సోనియా లేకపోతే తెలంగాణ వచ్చేది కాదు
కేసీఆర్ కూడా ఆమాట చెప్పారు
మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,జూన్1 (ప్రజా మంటలు):
సోనియా లేకపోతే తెలంగాణ వచ్చేది కాదు, ఆ విషయాన్ని కేసీఆర్ నిండు సభలో చెప్పారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. కేసీఆర్ ప్రభుత్వంలో అన్ని స్కీంలలో స్కామ్‌లు జరిగాయని.. గొర్రెల పథకంలో భారీ స్కాం జరిగిందన్నారు. నిజామాబాద్ పార్లమెంట్‌తో సహా 12 పార్లమెంట్ స్థానాల్లో గెలుస్తామన్నారు. కాంగ్రెస్ వేవ్‌తో మా నేతలు గెలుస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాబోయే పదేళ్లు మా ప్రభుత్వమేనన్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత బీఆర్ఎస్ కనుమరుగు అవుతుందన్నారు. ఆగస్టు 15 లోపు 2లక్షల రుణ మాఫీ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్రీయ గీతంపై కేటీఆర్ మతి భ్రమించి ఆందోళనలు చేస్తున్నారని విమర్శించారు. చిహ్నంపై అందరితో చర్చించి నిర్ణయం ఉంటుందన్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో అందరు రావులే ఉన్నారని ఆరోపించారు. అప్పటి సీఎం కేసీఆర్‌కు మానవత్వం లేదన్నారు. ఆవిర్భావం వేడుకలకు కేసీఆర్‌ను ఆహ్వానించామని.. వస్తారా రారా అన్నది ఆయన విజ్ఞతకు వదిలేస్తామన్నారు.జూన్‌లో అన్ని జిల్లాల్లో మంత్రులు పర్యటిస్తారని.. అభివృద్ధిపై సమీక్షలు ఉంటాయన్నారు. బీఆర్ఎస్ ఒక్క ఎంపీ సీటు గెలవదని.. ఫలితాల తర్వాత ఆ పార్టీ ఉండదన్నారు. బీజేపీ జూటా పార్టీ అంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శించారు. మోడీ ప్రధానిగా చేసిన అభివృద్ధి చెప్పకుండా.. మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రచారం చేశారని ఆరోపణలు చేశారు. ఫోన్ ట్యాపింగ్‌లో పోలీసులు తమ పని తాము చేసుకుంటున్నారని.. ఎంత మంది లోపలికి వెళ్తారు అన్నది త్వరలో తెలుస్తుందన్నారు.

భీమ్రాజు పల్లి లో హనుమాన్ జయంతి వేడుకలు

గొల్లపల్లి జూన్ జూన్ 01 (ప్రజామంటలు):
మండలంలోని భీమ్రాజు పల్లి గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలుఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అర్చకులు అయ్యోరి నరసయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులుతమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ధర్మకర్త చింతపండు శశికళ తిరుపతిరెడ్డి, రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ కందుకూరి కృష్ణారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ బొమ్మెన కుమార్, ప్రధాన కార్యదర్శి సాగర్, కంది స్వామి, మాజీ సర్పంచ్ రేవెల్ల సుజాత, లింగయ్య, సింగారపు లచ్చయ్య, బొమ్మన వెంకటేశం, సామల రవి, ప్రసాద్, బొమ్మన నరేందర్, చింతల రవీందర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలకు భీమదేవరపల్లి ఉద్యమకారులకు ఆహ్వానం
ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో పాల్గొననున్న భీమదేవరపల్లి తెలంగాణ ఉద్యమకారులు జైలుకెళ్లిన ఉద్యమకారులకు ప్రత్యేక ఆహ్వానం

భీమదేవరపల్లి జూన్ 01 (ప్రజామంటలు):
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న తెలంగాణ దశాబ్ది ఉత్సవాలకు మండలంలోని తెలంగాణ ఉద్యమకారులకు ప్రత్యేక ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు డ్యాగల సారయ్య, కాశిరెడ్డి ఆదిరెడ్డి మాట్లాడుతూ%%%. 2009 నుండి 2014 వరకు వివిధ దశలలో జేఏసీ పిలుపు మేరకు అన్ని రకాల నిరసన కార్యక్రమాలలో భీమదేవరపల్లి తెలంగాణ ఉద్యమకారులు ఉన్నారని, గల్లీ నుండి ఢిల్లీ వరకు వెళ్లి కోట్లాడిన ఘనత మండల ఉద్యమకారులదని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మంత్రి శిల్పా మోహన్ రెడ్డిని తరిమికొట్టిన ఘనత, గవర్నర్ రాకను అడ్డుకున్న ఘనత, ఢిల్లీలో సంసద్ యాత్రలో అరెస్ట్ అయిన ఘన చరిత్ర మండల ఉద్యమకారులదని అన్నారు.

చెన్నై-ముంబై విమానానికి బాంబు బెదిరింపు
ముంబై విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్

ముంబై,జూన్1(ప్రజా మంటలు):
ఇటీవల కాలంలో విమానాల్లో, విమనాశ్రయాల్లో ఆకతాయిలు బాంబులు పెట్టామని బెదిరింపు కాల్స్ వస్తున్న సంగతి తెలిసిందే.. ఈ క్రమంలో.. అధికారులు త్వరితగతిన చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరిస్తున్నారు. మరోవైపు.. ఇప్పటికి వచ్చిన బెదిరింపు కాల్స్ అన్నీ ఫేక్ అని అధికారులు నిర్ధారించారు. ఇదిలా ఉంటే.. తాజాగా మరో విమానానికి బెదిరింపు కాల్ వచ్చింది. దీంతో.. చెన్నై నుండి ముంబైకి వెళ్తున్న ఇండిగో 6%జు% 5314 విమానం ముంబై విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ అయింది.ముంబైలో ల్యాండ్ అయిన అనంతరం.. విమాన సిబ్బంది ప్రోటోకాల్‌ను అనుసరించారు. భద్రతా ఏజెన్సీ మార్గదర్శకాల ప్రకారం విమానాన్ని ఐసోలేషన్ బేకు తరలించారు. "ప్రయాణికులందరూ సురక్షితంగా విమానం నుండి దిగారు. ప్రస్తుతం విమానం తనిఖీలో చేపట్టారు. అన్ని భద్రతా తనిఖీలు పూర్తయిన తర్వాత, విమానాన్ని టెర్మినల్ ప్రాంతానికి తరలించనున్నారు" అని ఎయిర్‌లైన్స్ ఒక ప్రకటనలో పేర్కొంది.వారం రోజుల వ్యవధిలో ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడం ఇది రెండోసారి. అంతకుముందు మే 28న ఢిల్లీ నుంచి వారణాసికి వెళ్లే విమానంలో విమానానికి బెదిరింపు కాల్ వచ్చింది. బెదిరింపు నేపథ్యంలో.. విమానంలోని ప్రయాణికులను ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసర ద్వారం ద్వారా కిందకు దించారు. ఈ సంఘటన వీడియో క్లిప్‌ల్లో ప్రయాణికులు, విమాన సిబ్బంది వారి సామానుతో స్లైడ్‌ల ద్వారా విమానం నుండి ఎలా దిగుతున్నారో చూపించాయి. అయితే.. భద్రతా మార్గదర్శకాల ప్రకారం, ప్రయాణికులు తరలింపు 90 సెకన్లలోపు జరగాలి. అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణికులు తమ లగేజీని తీసుకెళ్లకూడదు. మరోవైపు.. ఢిల్లీ ఘటనలో భద్రతా మార్గదర్శకాలను విస్మరించడంతో ఇండిగో ఇద్దరు పైలట్లు, నలుగురు క్యాబిన్ సభ్యులను తొలగించింది.

సిరియాలో టర్కియే డ్రోన్ దాడి
నలుగురు అమెరికా యోధులు మృతి

సిరియా,జూన్1(ప్రజా మంటలు):
టర్కీ సిరియాలోని ఉత్తర ప్రాంతంపై డ్రోన్‌తో దాడి చేసింది. ఈ దాడిలో అమెరికాకు మద్దతు ఇస్తున్న నలుగురు యోధులు మరణించారు. 11 మంది పౌరులు గాయపడ్డారు. టర్కీ అధ్యక్షుడి ప్రకటన తర్వాత ఈ దాడి జరిగింది. దీనిలో అతను కుర్దిష్ నేతృత్వంలోని సమూహంపై చర్య గురించి మాట్లాడాడు. తుర్కియే కుర్దిష్ నేతృత్వంలోని సమూహాన్ని తీవ్రవాద సంస్థగా భావిస్తాడు. ఈ దాడి ఉత్తర నగరం కమిష్లీ.. దాని పరిసర ప్రాంతాలలో జరిగింది. ఈ ప్రాంతం అమెరికా మద్దతు గల.. కుర్దిష్ నేతృత్వంలోని సిరియన్ డెమోక్రటిక్ ఫోర్సెస్ (%ాణఖీ%) ఆక్రమించింది. వారి స్థానాలతో పాటు పౌరుల ఇళ్లు, వాహనాలపై దాదాపు 8 సార్లు దాడులు చేశారని ఎస్డీఎఫ్ తెలిపింది. ఈశాన్య సిరియాలో ఇటువంటి టర్కీ దాడులు అసాధారణం కాదు. ఖమిష్లీకి పశ్చిమాన ఉన్న అమూడా నగరంలో పారామెడిక్స్‌పై దాడి జరిగిన తర్వాత, ఆ ప్రాంతాలకు చేరుకోవడానికి ప్రయత్నించామని, అయితే టర్కీ దాడిలో తమ అంబులెన్స్‌లలో ఒకటి పూర్తిగా దెబ్బతిన్నదని కుర్దిష్ రెడ్ క్రెసెంట్ తెలిపింది. ఈ దాడి గురించి కుర్దిష్ నేతృత్వంలోని దళం పూర్తి సమాచారాన్ని అందించింది. టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్ గురువారం ఇచ్చిన ప్రకటన తర్వాత సిరియాపై టర్కీ చేసిన ఈ డ్రోన్ దాడి జరిగింది. సిరియాలోని ఉత్తర, తూర్పు భాగాలను నియంత్రించే కుర్దిష్ నేతృత్వంలోని అటానమస్ అడ్మినిస్ట్రేషన్, జూన్ 11న మునిసిపల్ ఎన్నికలను నిర్వహించాలని యోచిస్తున్నట్లు ప్రకటించింది. ఓట్లు హసాకే, రక్కా, డీర్ ఎల్-జోర్, అలెప్పో ప్రావిన్స్ తూర్పు భాగంలో నిర్వహించబడతాయి. ఈ రాబోయే ఎన్నికలు సిరియా, టర్కియే రెండింటి ప్రాదేశిక సమగ్రతకు ముప్పుగా అభివర్ణిస్తారు.టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్ మాట్లాడుతూ.. ఉత్తర సిరియాలోని కుర్దిష్ నేతృత్వంలోని గ్రూపులు స్థానిక ఎన్నికలను నిర్వహించడానికి ప్రణాళికలతో ముందుకు వెళితే వారిపై చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమన్నారు. ఎన్నికల సాకుతో మన దేశంపై చర్య తీసుకోవడానికి సిద్ధంగా లేం. సిరియా ప్రాదేశిక సమగ్రతకు వ్యతిరేకంగా ఉగ్రవాద సంస్థ చేపడుతున్న దూకుడు చర్యలను నిశితంగా పరిశీలిస్తున్నాయి. అయితే, ఈ విషయంపై టర్కీ ఇంకా ఎలాంటి వ్యాఖ్యానం చేయలేదు. ఈశాన్య సిరియాలో ఇటువంటి ఎన్నికలకు ప్రస్తుతం పరిస్థితులు ఉన్నాయని తాము నమ్మడం లేదని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి వేదాంత్ పటేల్ ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. ఈ గ్రూపులకు టర్కియేలో నిషేధించబడిన కుర్దిష్ ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. కుర్దిష్ మిలీషియా గ్రూప్, పీపుల్స్ ప్రొటెక్షన్ యూనిట్స్ అని కూడా పిలుస్తారు, ఇది టర్కీలో చట్టవిరుద్ధమైన కుర్దిష్ గ్రూపుతో ముడిపడి ఉంది. ఇది కుర్దిస్తాన్ వర్కర్స్ పార్టీతో సహా 1984 నుండి టర్కీలో తిరుగుబాటుకు నాయకత్వం వహిస్తుంది. పీపుల్స్ ప్రొటెక్షన్ యూనిట్లు సిరియన్ డెమోక్రటిక్ ఫోర్సెస్‌కు వెన్నెముకగా పనిచేస్తాయి. ఇస్లామిక్ స్టేట్ గ్రూపుకు వ్యతిరేకంగా పోరాటంలో కీలకమైన అమెరికా మిత్రపక్షం. టర్కీ ఆగ్రహించిన ఎస్డీఎఫ్ కి అమెరికా మద్దతు ఇస్తుంది.

మోడీకి చట్టం వర్తించదా..?
ధ్యానం ఫోటోపై దిగ్విజయ్ సింగ్ ఆగ్రహం

న్యూఢిల్లీ,జూన్1(ప్రజా మంటలు):
ప్రధాని నరేంద్రమోడీ ధ్యానంపై కాంగ్రెస్, ఆ పార్టీ నేతలు విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు. ఏడో దశ ఎన్నికల ప్రచారం ముగిసిన కొద్ది గంటల తర్వాత మే 30న ప్రధాని మోడీ కన్యాకుమారికి వెళ్లారు. అక్కడే 45 గంటలపాటు ధ్యానం చేశారు. ఒకప్పుడు స్వామి వివేకానంద ధ్యాన్యం చేసిన "వివేకానంద మెమోరియల్" స్థలంలో ఆయన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయితే, ఎన్నికల ముందు ఇలా చేయడంపై కాంగ్రెస్ అభ్యంతరం తెలిపింది. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘానికి కూడా ఫిర్యాదు చేసింది. ఈ రోజు ప్రధాని మోడీ తన ధ్యానాన్ని ముగించారు.ఢిల్లీకి పయణమయ్యారు.ఇదిలా ఉంటే, తాజాగా కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ మోడీ ధ్యానంపై ఫైర్ అయ్యారు. వివేకానంద మెమోరియల్‌లో ఫోటోగ్రఫీకి అనుమతి లేదని ఆయన అన్నారు. కానీ మోడీ ధ్యానం చేస్తున్న ఫోటోలు బయటకు రావడంపై అభ్యంతరం తెలిపారు. మోడీకి చట్టం, నిబంధనలు వర్తించవా..? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై స్పందించాల్సిందిగా ప్రధాని కార్యాలయాన్ని(పీఎంఓ)ని కోరారు. కపిల్ అనే యూజర్ ప్రధాని ధ్యానాన్ని ఉద్దేశించి ట్వీట్ చేశారు. "ఇక్కడ ఫోటోగ్రఫీకి అనుమతి లేదు మరియు చట్టం ద్వారా శిక్షార్హమైనది కాబట్టి మీరు వివేకానంద మెమోరియల్ లోపల ధ్యాన మందిరం ఫోటోలను చూడటం ఇదే మొదటిసారి." "కెమెరా-జీవి" అంటూ ఎద్దేవా చేశారు. "వివేకానంద రాక్ మెమోరియల్‌ని సందర్శించడానికి ఫోటోగ్రఫీ నియమాలు కఠినమైనవి మరియు పరిమితం చేయబడ్డాయి, ఎందుకంటే ఇది రక్షిత మరియు సున్నితమైన ప్రాంతం. మీరు ఫోటోలు లేదా వీడియోలు తీయడానికి అనుమతి లేదు. స్మారక చిహ్నం లోపల, మీరు స్మారక చిహ్నం వెలుపల నుండి లేదా ఫెర్రీ నుండి మాత్రమే ఫోటోలు లేదా వీడియోలను తీయవచ్చు, మీరు ఇతర సందర్శకుల గోప్యత మరియు గౌరవాన్ని కూడా గౌరవించాలి మీ కెమెరాతో వారిని ఇబ్బంది పెట్టవద్దు లేదా వేధించవద్దు." అంటూ ట్వీట్ చేశారు. ఈ విషయాన్నే దిగ్విజయ్ సింగ్ హైలెట్ చేశారు.

బెంగాల్లో అల్లరి మూకల ఆగడం

పోలింగ్ కేంద్రంలో చొరబడి ఇవిఎంల అపహరణ

చెరువులో విసరేసి పారిపోయిన దుండగులు

కోల్‌కతా,జూన్1 (ప్రజామంటలు): లోక్‌సభ ఎన్నికల చివరి దశ పోలింగ్‌లో భాగంగా దేశంలోని పలు రాష్ట్రాల్లో శనివారం పోలింగ్ జరుగుతోంది. బెంగాల్ జయనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఓ అల్లరిమూక పోలింగ్ స్టేషన్‌లోకి చొరబడి, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాన్ని చెరువులో విసిరేసిన ఘటనతో ఉద్రిక్తతలు ఏర్పడ్డాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుల్తాలీ గ్రామంలో పోలింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్న సమయంలో స్థానికులకు, పోలింగ్ ఏజెంట్లకు మధ్య వివాదం చెలరేగింది. బేనిమాధవ్‌పూర్ ఎఫ్‌పి స్కూల్ బూత్‌లోకి ఏజెంట్లను రానీయకుండా కొంతమంది అడ్డుకోవడంతో కలకలం రేగింది. వీరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. దీంతో ఆగ్రహించిన స్థానికులు బలవంతంగా పోలింగ్ స్టేషన్‌లోకి ప్రవేశించారు. ఓటర్ వెర్గి÷డ్ పేపర్ ఆడిట్ ట్రయల్(÷ఎఖం÷)తో కూడిన ఈవీఎంను బయటకు తీసుకెళ్లి చెరువులో పడేశారు.ఘటనపై సెక్టార్ ఆఫీసర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. 'సెక్టార్ పరిధిలోని మొత్తం ఆరు బూత్‌లలో పోలింగ్ ప్రక్రియ అంతరాయం లేకుండా సాగుతోంది. ఈవీఎంను చెరువులో పడేసిన చోట కొత్త ఈవీఎం, పేపర్లను సెక్టార్ అధికారికి అందించాం' అని పశ్చిమ బెంగాల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ తెలిపారు. మరో ఘటనలో కోల్‌కతాలోని జాదవ్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గంలోని భాంగర్‌లోని సతులియా ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తతలు చెలరేగాయి. ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్ (ఎ÷ూఈ), సీపీఐ(ఎం) కార్యకర్తల మధ్య వివాదం చోటు చేసుకుంది. అనంతరం ఇరువర్గాలు పరస్పరం బాంబులతో దాడులకు దిగారు. ఈ ఘర్షణలో పలువురు ఐఎస్ఎఫ్ సభ్యులు గాయపడ్డారు. బెంగాల్‌లో లోక్‌సభ ఎన్నికల ఏడో దశ పోలింగ్ ప్రక్రియ ఈరోజు ఉదయం 7 గంటలకు ప్రారంభమైంది. డమ్ డమ్, బరాసత్, బసిరాత్, జయనగర్, మధురాపూర్, డైమండ్ హార్బర్, జాదవ్‌పూర్, కోల్‌కతా దక్షిణ్, కోల్‌కతా ఉత్తర స్థానాల్లో సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ కొనసాగుతుంది.

ప్రశాంతంగా ముగిసిన సార్వత్రిక ఎన్నికలు

ఏడు రాష్ట్రాల్లో జరిగిన పోలింగ్

బెంగాల్‌లో పలుచోట్ల హింసాత్మక ఘటనలు

సీపీఎం, ఐఎస్ఎఫ్ నేతలు, కార్యకర్తల మధ్య ఘర్షణ

న్యూఢిల్లీ,జూన్1(ప్రజామంటలు): లోక్ సభ ఎన్నికల తుది దశ పోలింగ్ ముగిసింది. మొత్తం ఏడు విడతల్లో జరిగిన ఎన్నికలు.. శనివారం జరిగిన ఏడో దశ పోలింగ్‌తో ముగిశాయి. దీంతో అందరి చూపు జూన్ 4న జరగనున్న కౌంటింగ్‌వైపు పడింది. ఏడో దశలో భాగంగా ఏడు రాష్ట్రాల్లోని 57 అసెంబ్లీ స్థానాలకు, ఒడిషాలోని 42 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరిగింది. చండీగఢ్‌తో పాటు పంజాబ్‌లోని మొత్తం 13 స్థానాలు, హిమాచల్ ప్రదేశ్‌లోని నాలుగు స్థానాలు, ఉత్తరప్రదేశ్‌లోని 13 స్థానాలు, పశ్చిమ బెంగాల్‌లో 9, బీహార్‌లో 8, ఒడిశాలో 6, జార?ండ్‌లో మూడు స్థానాలకు శనివారం పోలింగ్ ముగిసింది. ఒడిశాలోని 42 అసెంబ్లీ నియోజకవర్గాలకు, హిమాచల్ ప్రదేశ్‌లోని ఆరు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు ఒకేసారి జరిగాయి. ఈ సాయంత్రం 5 గంటలకు, ఏడు రాష్ట్రాలు, చండీగఢ్‌లో 58.3% ఓటింగ్ నమోదైంది. బీహార్‌లో అత్యల్పంగా 35% కంటే ఎక్కువ ఓటింగ్ నమోదు కాగా, హిమాచల్ ప్రదేశ్‌లో అత్యధికంగా 48.6% నమోదైంది. లోక్ సభ తుది దశ ఎన్నికల వేళ పశ్చిమ బెంగాల్ లోని పలుచోట్ల హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. బెంగాల్ రాజధాని కోల్‌కతాకు దగ్గర్లోని జాదవ్ పూర్ లోక్ సభ నియోజకవర్గంలో సీపీఎం, ఐఎస్ఎఫ్ నేతలు, కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. సౌత్ 24 పరగణాల జిల్లాలో ఓ పోలింగ్ బూత్ లోకి చొరబడిన జనం.. ఈవీఎంతో పాటు ఎన్నికల సామగ్రిని ఎత్తుకెళ్లి దగ్గర్ లోని నీటి కుంటలో పడేశారు. భాన్ గర్ నియోజకవర్గంలో అధికార తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలు, ఏఐఎస్ఎఫ్ కార్యకర్తల మధ్య గొడవ జరిగింది. తృణముల్ కాంగ్రెస్ కార్యకర్తలు ఏఐఎస్ఎఫ్ అభ్యర్థికి చెందిన వాహనాన్ని ధ్వంసం చేశారు. అటు ఇదే జిల్లాలోని జయ్ నగర్ నియోజకవర్గ పరిధిలోని కుల్తాలీలో పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో అల్లర్లు చెలరేగాయి. పోలింగ్ బూత్‌లోకి తమ ఏజెంట్లను అనుమతించట్లేదని ఓ పార్టీకి చెందిన కార్యకర్తలు పొలింగ్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. అంతటితో ఆగకుండా మూకుమ్మడిగా పోలింగ్ బూత్‌లోకి చొరబడ్డారు. అటు ఎన్నికల సామగ్రిని చెల్లాచెదురు చేసి ధ్వంసం చేశారు. ఓ ఈవీఎంతో పాటు వీవీప్యాట్ మెషిన్లను ఎత్తుకెళ్లారు. వాటిని దగ్గర్లోని ఓ నీటి కుంటలో పడేశారు. పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో.. బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టారు. నీటిలో పడేసిన ఎన్నికల సామగ్రిని, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌ను వెలికితీశారు. అయితే, ఈ ఘటనపై ఎన్నికల సంఘం వివరణ ఇచ్చింది. కుల్తాలీలో ముందు జాగ్రత్త చర్యగా అదనంగా ఏర్పాటు చేసిన ఈవీఎం, వీవీప్యాట్లనే నీటి కుంటలో పడేశారని పేర్కొంది. కుల్తాలీ పోలింగ్ బూత్ లో పోలింగ్ యథావిధిగా జరుగుతోందని స్పష్టం చేసింది. సెక్టార్ ఆఫీసర్ కు మరో ఈవీఎంను అందజేసినట్లు తెలిపింది. ఇక ఈ ఘటనపై కుల్తాలీ సెక్టార్ ఆఫీసర్ పోలీసులకు ఫిర్యాదు చేశారని ఈసీ స్పష్టం చేసింది. దీనిపై పోలీసులు సమగ్ర విచారణ చేపట్టారని పేర్కొంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ బూత్ వద్ద అదనపు బలగాలను ఏర్పాటు చేసినట్లు ఎన్నికల కమిషన్ పేర్కొంది.

అరవింద్ కేజ్రీవాల్‌కు దక్కని ఊరట..

మళ్లీ తీహార్ జైలుకు వెళ్లనున్న కేజ్రీవాల్

న్యూఢిల్లీ,జూన్1(ప్రజామంటలు): ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో అరెస్ట్ అయ్యి మధ్యంతర బెయిల్ మీద బయటకు వచ్చిన అరవింద్ కేజ్రీవాల్ మళ్లీ తీహార్ జైలుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. కేజ్రీవాల్ తరఫున ఆమ్ ఆద్మీ పార్టీ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై రౌస్ అవెన్యూ కోర్టు శనివారం తీర్పు రిజర్వ్ చేసింది. కాగా జూన్ 5న తీర్పును వెలువరించనుంది రూస్ అవెన్యూ కోర్టు. దీంతో కేజ్రీవాల్ ఆదివారం(జూన్ 2) తిరిగి తీహార్ జైలుకు వెళ్లవలసి ఉంటుంది. వైద్య కారణాలతో వారం రోజుల పాటు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కోర్టును ఆశ్రయించింది. అయితే అరవింద్ కేజ్రీవాల్ చేసిన దరఖాస్తును ఈడీ వ్యతిరేకించింది. అతని ఆరోగ్యం కుదురుగానే ఉందని.. ఢిల్లీ సీఎం తన ఆరోగ్యంపై తప్పుడు ప్రకటనలు చేశారని దర్యాప్తు సంస్థ పేర్కొంది. ఏదైనా వైద్య పరీక్షలు అవసరమైతే అరవింద్ కేజ్రీవాల్‌ను ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (ఎయిమ్స్) లేదా ఇతర ఆసుపత్రికి తీసుకువెళతామని కూడా దర్యాప్తు సంస్థ స్పష్టం చేసింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం అరవింద్ కేజ్రీవాల్‌కు గతంలో సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఈ గడువు జూన్ 1న ముగుస్తుంది. జూన్ 2న (ఆదివారం) ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ తీహార్ జైలు అధికారుల ముందు లొంగిపోవాల్సి ఉంటుంది. వైద్య పరీక్షల కోసం తన మధ్యంతర బెయిల్‌ను ఏడు రోజుల పాటు పొడిగించాలన్న అభ్యర్థనను అత్యవసరంగా జాబితా చేయడానికి సుప్రీంకోర్టు రిజిస్ట్రీ నిరాకరించడంతో ఆప్ చీఫ్ ఢిల్లీ కోర్టును ఆశ్రయించారు. అరవింద్ కేజ్రీవాల్‌కు ట్రయల్ కోర్టు నుంచి రెగ్యులర్ బెయిల్ పొందే అవకాశం ఉన్నందున, అతని అభ్యర్థనను స్వీకరించబోమని కోర్టు స్పష్టం చేసింది. కాగా అరవింద్ కేజ్రీవాల్..ఆప్ అధినేత, ఢిల్లీ సీఎం..ఇప్పుడు కొత్తగా వచ్చి చేరిన మరో ట్యాగ్.. ఢిల్లీ లిక్కర్ స్కామ్ సూత్రధారుల్లో ఒకరని. ఆయన మాట, ఆయన తీరు మొదటి నుంచి కాస్త కన్ఫ్యూజన్‌ను క్రియేట్ చేస్తుంటాయి. ఫర్ ఎగ్జాంపుల్.. ఆయన జైల్లో ఉన్నన్ని రోజులు చెప్పిన మాటలు జైలు నుంచి బయటికి వచ్చాక చెప్పిన మాటలు. ఇక జైల్లో లొంగిపోవడానికి కొన్ని గంటల ముందు చెప్పిన మాటలు అస్సలు సంబంధం లేకుండా ఉన్నాయి.ఇన్నాళ్ల పాటు బీజేపీపై నిప్పులు చెరిగిన ఆ గొంతులో మళ్లీ సింపతి రాగం వినిపిస్తోంది. ఇన్నాళ్ల పాటు కాళ్లకు చక్రాలు కట్టుకొని పరుగులు పెట్టిన ఆ మనిషి ఇప్పుడు మళ్లీ తన ఆరోగ్య సమస్యలను ఏకరువు పెడుతున్నారు. జైలు నుంచి మళ్లీ బయటికి ప్రాణాలతో వస్తానో రానో అంటున్నారు. తాను లేకపోయినా ప్రజలకు అన్ని అందుతాయంటూ ఆయన ప్రభుత్వ పథకాల పేర్లన్నంటిని ప్రజలకు గుర్తు చేస్తున్నారు.

ఆఫ్‌కోర్స్ మరికొన్ని గంటల్లో పోలింగ్ ఉందనుకోండి.. ఇన్‌డైరెక్ట్‌గా ప్రజలకు గుర్తు చేశారేమో.. ఇక ఆఖర్లో ఆయన చెప్పేదేంటి అంటే.. ప్రజల మద్దతుంటే త్వరలోనే బయటికి వస్తానంటున్నారు కేజ్రీవాల్ ఇంకో ఇంట్రెస్టింగ్ విషయం ఉంది కేజ్రీవాల్ ఇష్యూలో.. కేజ్రీవాల్ తన బెయిల్‌ను ఎక్స్‌టెండ్ చేయాలంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దానికి ఆయన చెప్పిన రీజన్ ఏంటంటే.. కొన్ని మెడికల్ టెస్ట్‌లు చేయించుకోవాలి.. నా ఆరోగ్యం అస్సలు బాగా లేదన్నారు. బట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వెంటనే కౌంటర్ వేసింది. అనారోగ్యంగా ఉంటే ప్రచారం ఎలా చేశారు? ఇన్ని రోజులు లేని అనారోగ్యం ఇప్పుడే ఎందుకు వచ్చింది? ఇలా ప్రశ్నలు వేసింది. దీంతో సీన్ రివర్సైంది. కేజ్రీవాల్ లెటెస్ట్ వీడియోలో తన బరువును కూడా మెన్షన్ చేశారు. జైలులో ఉన్న సమయంలో 6 కేజీల బరువు తగ్గానన్నారు. బట్ దీనిపై కూడా పెద్ద రాద్ధాంతమే జరుగుతోంది. జైలులో ఉన్న సమయంలో కూడా ఆయన బరువులో పెద్ద మార్పేమి లేదన్న ప్రచారం జరుగుతోంది. కేజ్రీవాల్ లాంటి వ్యక్తులు కూడా ఇలాంటి చిల్లర రాజకీయం చేయడమేంటన్న చర్చ సాగుతోంది.

ముగిసిన జగన్ విదేశీ పర్యటన

ఉదయం గన్నవరం చేరిక

నేరుగా తాడేపల్లి నివాసానికి పయనం

విమానాశ్రయంలో స్వాగతించిన పార్టీ నేతలు

విజయవాడ,జూన్1(ప్రజామంటలు): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విదేశీ పర్యటన ముగిసింది. శనివారం ఉదయం కుటుంబ సభ్యులతో సహా ఆయన రాష్ట్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా గన్నవరం ఎయిర్‌పోర్ట్ దగ్గర సీఎం జగన్‌కు ఘన స్వాగతం లభించింది. ఎంపీలు విజయసాయిరెడ్డి నేతృత్వంలో పలువురు ఎంపీలు, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ కీలక నేతలు సీఎం జగన్‌కు స్వాగతం పలికారు. పార్టీ కేడర్ పెద్ద ఎత్తున తరలివచ్చింది. అక్కడి నుంచి నేరుగా ఆయన తాడేపల్లి నివాసానికి చేరుకున్నారు. ఏపీ ఎన్నికలు పూర్తయిన తర్వాత మే నెల 17వ తేదీన సీఎం జగన్ విదేశీ పర్యటనకు వెళ్లిన సంగతి తెలిసిందే. లండన్, స్విట్జర్లాండ్ దేశాల్లో కుటుంబసమేతంగా ఆయన పర్యటించారు. పదిహేను రోజుల తర్వాత తిరిగి శనివారం స్వదేశానికి విచ్చేశారు. జూన్ 4వ తేదీన ఏపీకి జడ్జిమెంట్ డే. ఈ నేపథ్యంలో నేడో, రేపో ఓట్ల లెక్కింపు రోజు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వైఎస్సార్‌సీపీ శ్రేణులకు సీఎం జగన్ దిశానిర్దేశం చేసే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి లండన్ పర్యటన నిన్నటితో ముగిసింది. ప్రత్యేక విమానంలో విజయవాడలోని గన్నవరం చేరుకున్న వైసీపీ అధినేతకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. 15 రోజుల పాటు లండన్‌లో ఉన్నారు. గన్నవరం విమానాశ్రయం నుంచి నేరుగా తాడేపల్లిలోని నివాసానికి చేరుకున్నారు. కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనేదానిపై చర్చలు జరపనున్నారు. 15 రోజులుగా రాష్ట్రంలో జరిగిన పరిణామాలపై కూడా సమీక్ష చేయనున్నారు.

అమరుల త్యాగాలు స్మరించుకోవాలి

ఆవిర్భావం రోజు వారికి ఎంతో ప్రాముఖ్యం

ప్రజలకు మంత్రి జూపల్లి శుభాకాంక్షలు

హైదరాబాద్,జూన్1(ప్రజామంటలు): ప్రత్యేక రాష్ట్రం కోసం తమ ప్రాణాలను అర్పించిన అమరుల త్యాగాల్ని స్మరించుకునే ఆవిర్భావ దినోత్సవానికి ఎంతో ప్రాముఖ్యం ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారికి ఈ సందర్భంగా నివాళి అర్పిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందరికీ సమానంగా అందినప్పుడే అమరులకు నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు, సకల జనులకు, ప్రత్యేక రాష్ట్ర అకాంక్షను గౌరవించి మద్దతు తెలిపిన ప్రతీ ఒక్కరికీ, తెలంగాణ కలను సాకారం చేసిన సోనియా గాంధీ కి ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీగా అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని వ్యాఖ్యానించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన కొనసాగిస్తోందని అన్నారు. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్న మహనీయుల ఆశయ సాధనకు' ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. అన్నివర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మన్ననలను పొందుతున్నదని వివరించారు. యావత్ తెలంగాణ సమాజం మనోభావాలకు అనుగుణంగా, ప్రజా సంఘాలు, పౌర సంస్థలు, ఉద్యోగ సంఘాలతో సంప్రదిస్తూ... వారి అభిప్రాయాలను గౌరవిస్తూ... ప్రజాస్వామిక పాలనను అందిస్తూ... కాంగ్రెస్ ప్రభుత్వం నూతన ఒరవడిని సృష్టించిందని మంత్రి జూపల్లి కృష్ణారావు వ్యాఖ్యానించారు.

విజయవాడలో అదుపులోకి రాని డయేరియా

మృతుల సంఖ్య 9కి చేరిక..ఆస్పత్రుల్లో బాధితులు

డయేరియాకు కలుషిత నీరే కారణమన్న చంద్రబాబు

విజయవాడ,జూన్1(ప్రజామంటలు): విజయవాడ నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రబలిన అతిసారం అదుపులోకి రాలేదు. అతిసార లక్షణాలతో మృతి చెందిన వారి సంఖ్య 9కి చేరుకుంది. మొగల్రాజుపురంలో గల్లా కోటేశ్వరరావు(60) అనే వృద్ధుడు వాంతులు, విరేచనాలతో మృతి చెందాడు. ఇప్పటికే డయేరియా లక్షణాలతో మొగల్రాజపురం, పాయకాపురంలో ఎనిమిది మంది మృతి చెందారు. విజయవాడ నగరంలో గత ఐదు రోజుల్లో తొమ్మిది మంది మృత్యువాత పడ్డారు. వందల మంది ఆసుపత్రి పాలయ్యారు. ఒక్క మొగల్రాజపురంలోనే ఇప్పటివరకు ఆరుగురు విరేచనాలతో మృతి చెందారు. పాయకాపురం, అజిత్‌సింగ్ నగర్ ప్రాంతాల్లో వారం వ్యవధిలో ఇద్దరు మహిళలు, ఒక బాలుడు మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఇంత తీవ్రత ఉన్నా.. వైద్యారోగ్యశాఖ ప్రత్యేక శిబిరాలు పెట్టలేదు. మొగల్రాజ పురం లోని సీపీఎం కార్యాలయంలో ఆరు పడకలను ఏర్పాటుచేసి వారి సౌజన్యంతో చికిత్స అందిస్తోంది. దాదాపు 250 మంది రక్తనమూనాలు సేకరించామని చెబుతున్నా.. ఇంతవరకు ఒక్కదాని ఫలితమూ ప్రకటించలేదు.నగరంలో డయేరియా మరణాలు ఆందోళనకరమని తెదేపా అధినేత చంద్రబాబు అన్నారు. విజయవాడలో డయేరియాతో వారం రోజుల వ్యవధిలో 9 మంది చనిపోవడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం వెంటనే సమస్యపై దృష్టి పెట్టాలని కోరారు. కలుషిత నీటితో ప్రజల ప్రాణాలు పోయే పరిస్థితి వచ్చిందన్నారు. డయేరియాతో కాకుండా ఇతర అనారోగ్య కారణాలతో వీరంతా చనిపోయారని అధికారులు చెప్పడం సరికాదన్నారు. కలుషిత నీటి గురించి ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులపై అధికారులు స్పందించాలని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని చంద్రబాబు డిమాండ్ చేశారు.

అల్యూమినియం పరిశ్రమలో గ్యాస్ లీక్

50 మంది కార్మికులకు అస్వస్థత

హుటాహుటిన రేణిగుంట ఆస్పత్రికి తరలింపు

తిరుపతి,జూన్1(ప్రజామంటలు): ఏర్పేడు మండలం రాజులపాలెంలోని సీఎంఆర్ అల్యూమినియం పరిశ్రమలో 50 మంది కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. అల్యూమినియం తుక్కు కరిగించే క్రమంలో చిన్నపాటి గ్యాస్ సిలిండర్ లీకేజీ కావడంతో దాదాపు 50 మంది కార్మికులు ఉన్నట్టుండి వాంతులు చేసుకొని సొమ్మసిల్లి పడిపోయారు. దీంతో పరిశ్రమ యాజమాన్యం వారిని వెంటనే రేణిగుంట బాలాజీ ఆస్పత్రికి తరలించింది. వైద్య పరీక్షల అనంతరం ఆరోగ్యం మెరుగుపడిన కార్మికులను తిరిగి పరిశ్రమకు తీసుకొచ్చారు. కొందరు కార్మికుల ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్నారు. ప్రమాదశాత్తూ ఒక్కసారిగా గ్యాస్ లీక్ కావడంతో సుమారు 50మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బాధితుల్లో 25మంది మహిళలు ఉండటం గమనార్హం. అస్వస్థకు గురైన కార్మికులను హుటాహుటిన రేణిగుంట బాలాజీ హాస్పిటల్‌కు తరలించారు. వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు విచారణ ప్రారంభించారు. విష వాయువు లీక్ అయ్యిందన్న సమాచారంతో స్థానిక గ్రామస్థులు తీవ్ర ఆందోళనకు గరవుతున్నారు.

హనుమాన్ చాలీసా భక్త బృందం ఆధ్వర్యంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు, ప్రత్యేక పూజలు...

జగిత్యాల జూన్ 1 (ప్రజా మంటలు) జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ వీధి హరిహరాలయంలో హనుమాన్ చాలీసా భక్త బృందం ఆధ్వర్యంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు ప్రత్యేక పూజలు...ఈ సందర్భంగా హనుమాన్ జయంతిని పురస్కరించుకొని శనివారం రాత్రి 7 గంటలకు. విశేష సంఖ్యలో మహిళలు భక్తులు పాల్గొని హనుమాన్ చాలీసా పారాయణం, భక్తి పాటలతో భజనలు అంగరంగ వైభవంగా ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళహారతులు సమర్పించారు.అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.కార్యక్రమంలో హనుమాన్ చాలీసా భక్త బృందం, సభాపతి తిగుళ్ల సూర్యనారాయణ శర్మ, సంగనభట్ల నరేందర్ శర్మ, కంజర్ల అనంతాచారి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పొన్నం యువసేన భరోసా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తంగళ్ళపల్లి రమేష్.

ఎల్కతుర్తి జూన్ 1 ప్రజా మంటలు ఎల్కతుర్తి మండలంలోని గోపాల్పూర్ గ్రామంలో శనివారం రోజున మరణించినటువంటి ఉట్కూరు కరుణాకర్ ఆర్మీ జవాన్ రిటైర్ అనారోగ్యంతో మరణించారు విషయం తెలుసుకున్న పొన్నం యువసేన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రమేష్ ఉట్కూరి కరుణాకర్ పార్థివ దేహానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించి నివాళు లర్పించి దహన సంస్కారానికి ఆర్థిక సహాయం అందించిన పొన్నం యువసేన తంగళ్ళపల్లి రమేష్. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్కతుర్తి మండలంలోని నిరుపేదల కుటుంబాలకు ఎల్లవేళలా పొన్నం యువసేన అండగా ఉంటుందని చనిపోయిన వారి కుటుంబానికి వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో గోపాల్పూర్ గ్రామ శాఖ మాజీ గౌడ సంఘం అధ్యక్షులు మాచర్ల మనోజ్ గౌడ్ శ్రీపతి మణికిరణ్ గౌడ్ మారుపాక సందీప్ మామునూర్ కళ్యాణ్ జనగాని ప్రణీత్ పెండ్యాల తిరుపతి ఉట్కూరు శ్రీకాంత్ శ్రీపతి మనోజ్ శ్రీపతి రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జగిత్యాల పట్టణంలో అమరవీరుల స్తూపం వద్ద ఏర్పాట్లను పరిశీలించిన జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ అమ్మితే క్రిమినల్ కేసులు

వేలేరు ఎస్సై డి. హరిత

వేలేరు జూన్ 01 (ప్రజామంటలు):

నకిలీ విత్తనాల అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని వేలేరు ఎస్సై హరిత హెచ్చరించారు.శనివారం వేలేరు మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులలో ఎమ్మార్వో, ఎస్సై ,వ్యవసాయ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ ఓ పద్మ మాట్లాడుతూ రైతులకు నకిలీ విత్తనాలు అమ్మిన మోసం చేసినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎమ్మార్పీ ధరలకే విత్తనాలు విక్రయించాలని సూచించారు. అదేవిధంగా విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలన్నారు. ప్రతి షాప్ లో నిర్వాహకులు స్థానిక వివరాలను తెలిపే సూచికల బోర్డు ఏర్పాటు చేయాలని, రైతులకు విత్తనాలు పురుగుల మందులను అమ్మినపక్షంలో వారి వివరాలను పొందుపరచాలన్నారు. రైతులను మోసం చేసినప్పుడు ఫిర్యాదులు అందితే మాత్రం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు సైతం వ్యవసాయ అధికారులు సూచించిన విత్తనాలను కొనుగోలు చేయాలని నకిలీ విత్తనాలు కొనుగోలు చేయొద్దు అన్నారు. నిత్యం తనిఖీలు ఉంటాయని వ్యాపారులు అధిక ధరలు విక్రయించినట్లు తెలిసినట్లయితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో కోమి ఎస్సై హరిత ,వ్యవసాధికారి పద్మ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల పట్టణంలో నవదుర్గ క్షేత్ర పీఠం ఆవరణంలో గజ్జ పూజ కార్యక్రమంలో పాల్గొన్న జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్.

హనుమాన్ జయంతి సందర్భంగా జగిత్యాల పట్టణంలోని పలు హనుమాన్ దేవాలయాలు ప్రత్యేక పూజలు నిర్వహించిన జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

సికింద్రాబాద్, జూన్ 01 (ప్రజామంటలు):

బౌద్ధనగర్ డివిజన్ లోని పార్శీగుట్ట న్యూ అశోక్ నగర్ లోని శ్రీ ఆంజనేయ సాయిబాబా ఆలయంలో శనివారం శ్రీ హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీస్వామివారికి విశేష నవ కలశ పంచామృతాభిషేకం, ఆకు పూజ కార్యక్రమాలను ఘనంగా చేశారు. వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి ప్రసాదంగా అన్నదానం నిర్వహించారు. ఆలయ చైర్మన్ శ్రీపతి సత్యనారాయణ, ప్రధాన అర్చకులు చక్రవర్తుల మోహన చార్యులు, సోషల్ వర్కర్ రాజు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులపై గాంధీలో నోడల్ అధికారులకు అవేర్నెస్

అటెండ్ అయిన పలు జిల్లాల మోడల్ అధికారులు

సికింద్రాబాద్ జూన్ 01 (ప్రజామంటలు):

కిడ్నీ సంబంధిత వ్యాధులు, డయాలసిస్ పైన నోడల్ అధికారులతో గాంధీ ఆసుపత్రిలోశనివారం అవగాహన సదస్సును నిర్వహించారు. తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న హబ్ అండ్ స్పోక్ మోడల్ క్రింద గాంధీ హబ్ కి సంబంధించి 22 స్పోక్ సెంటర్ల నోడల్ ఆఫీసర్లతో ఈ కార్యక్రమం నిర్వహించారు. కరీంనగర్, సిరిసిల్ల, ఖమ్మం, నర్సంపేట తదితర జిల్లాల 22 స్పోక్ సెంటర్ల నుంచి మోడల్ అధికారులతో పాటు సూపరింటెండెంట్ లు ఈ సెమినార్ కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవో విశాలాచ్చి మాట్లాడుతూ... ఇలాంటి అవేర్నెస్ సెమినార్ ల వలన నోడల్ ఆఫీసర్లలో నైపుణ్యం పెరిగి, మారుమూల ప్రాంతాల్లో ఉండే డయాలసిస్ రోగులకు మంచి వైద్యం అందుతుందన్నారు. గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా. రమేష్ రెడ్డి మాట్లాడుతూ కిడ్నీ వ్యాధి తీవ్రత, దాని ప్రభావం పరోక్షంగా కుటుంబం పైన పడుతుందన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రాజారావు నెఫ్రాలజీ విభాగం వైద్యులు చేస్తున్న సేవలను ఆయన కొనియాడుతూ వారిని అభినందించారు. సెమినార్ లో తమకున్న సందేహాలను నోడల్ ఆఫీసర్లు సంబంధిత వైద్యాధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు. టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, నెఫ్రాలజీ విభాగాధిపతి డాక్టర్ మంజుష యాడ్ల, డాక్టర్ విక్రమ్, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

భవనం కూలేదాకా...లాగుతారా...?!

శిథిలావస్థకు చిలకలగూడ ఠాణా భవనం

ముప్పు వాటిల్లకముందే ప్రభుత్వం స్పందించాలి

సికింద్రాబాద్ జూన్ 01 (ప్రజామంటలు) :

చిలకలగూడ పోలీస్ స్టేషన్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. సెల్లార్ తోపాటు పిల్లర్లు, స్లాబ్, కిటికీల పెచ్చులు ఊడి కింద పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై విస్మయం వ్యక్తమవుతోంది. ఠాణా భవనం ఎప్పుడు కుప్ప కూలుతుందో నని అటు పోలీస్ సిబ్బంది, ఇటు

సందర్శకులు బిక్కు, బిక్కు మంటు కాలం గడుపుతున్నారు. భవనం ఖాళీ చేయాలని జీహెచ్ఎమ్సీ అధికారులు పలుమార్లు నోటీసులిచ్చినా ఉన్నతాధికారులు స్పందించకపోవడం గమనార్హం. ఏదేని ముప్పు వాటిల్లకముందే ప్రభుత్వం స్పందించి చిలకలగూడ పోలీస్ స్టేషన్ భవనాన్ని సురక్షిత బిల్డింగ్ కు షిఫ్ట్ చేయాలని కోరుతున్నారు.

జిల్లాలో ఎలక్ట్రిసిటీ బిల్లుకు డిజిటల్ ముబాయిల్ స్కానర్ ఆవిష్కరణ

జగిత్యాల జూన్ 01 (ప్రజామంటలు):

జిల్లా లో కొత్తగా ఎలక్ట్రిసిటీ బిల్లు వెరియేషన్ సదుపాయాన్ని శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభించిన ఏఓ భూమయ్య, ముబాయిల్ స్కైనింగ్ ద్వారా వాణిజ్య మరియు కమర్షియల్ వినియోగదారులకు ఆన్లైన్ ద్వర ముబాయిల్ ద్వార ఆన్లైన్లో బిల్లులు జారీ చేస్తూ ప్రజలకు మరియు వాణిజ్య వ్యాపార వినియోగదారులకు కొత్త సదుపాయాన్ని కలిగించారు. ఈ సదుపాయాన్ని తాము ఉన్నచోటే తమ ముబాయిల్ ద్వార ఎలక్ట్రిసిటీ బిల్లు కట్టుకోవచ్చు అని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఏఓ భూమయ్య, సబ్ ఇంజనీర్ దయాకర్, రమేష్, లైన్ ఎగ్జిక్యూటివ్స్ రాజమల్లు, మధుసూదన్, ప్రకాష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ గా సజ్జద్ అలీ

జమ్మికుంట జూన్ 01 (ప్రజామంటలు):

హుజురాబాద్ నియోజకవర్గం వర్కింగ్ ప్రెసిడెంట్ గా జమ్మికుంటకు చెందిన సజ్జద్ అలీని నియమిస్తూ శనివారం ఆల్ ఇండియా యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ బి వి శ్రీనివాస్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సజ్జద్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుండి ఎన్ ఎస్ యు ఐ కార్యకర్తగా, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా, కాంగ్రెస్ పార్టీకి నికార్సైన కార్యకర్తగా పనిచేస్తున్నానని నా పనిని గుర్తించి నాకు హుజురాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్గా నియమించడం చాలా సంతోషకరమనితెలిపారు. కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు పదవులు అందుతాయని, అధిష్టానం గుర్తిస్తుందని తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన ఆల్ ఇండియా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బివి శ్రీనివాస్, స్టేట్ ప్రెసిడెంట్ శివసేనా రెడ్డి, మజీద్ ఖాన్, ఉమ్మడి జిల్లా మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిల్ల శ్రీధర్ బాబు, హుజురాబాద్ నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వడితల ప్రణవ్ బాబు లకు కృతజ్ఞతలు తెలిపారు.

పే బ్యాక్ సొసైటీ

గురుకుల స్కూల్ కి పెయింట్స్ అందజేత

టిజిపిఏ రాష్ట్ర అధ్యక్షులు అంబాల ప్రభాకర్ (ప్రభు)

జమ్మికుంట జూన్ 01 (ప్రజామంటలు): కరీంనగర్ అలుగునూర్ తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సొసైటి సెంట్రల్ ఆఫ్ ఎక్సెలెన్స్ (సిఓఈ) విద్యాలయం సుందరీకరణ కోసం కలర్స్ కావాలని ప్రిన్సిపల్ దేవేందర్ రెడ్డి కోరగా శనివారం సుమారు 5 వేల రూపాయల కలర్స్ ను వైస్ ప్రిన్సిపాల్ రామ్ సింగ్ చేతికి తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ (టిజిపిఏ) రాష్ట్ర అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ (ప్రభు) అందజేశారు. ఈ సందర్భంగా ప్రభు మాట్లాడుతూ ఐదో తరగతి నుండి ఇంటర్ సెకండియర్ వరకు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సొసైటి లో చదువుకొని సమాజంలో మంచి కళాకారుడిగా, సామాజిక కార్యకర్తగా, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారణంగా అన్ని రంగాలను ఉన్నతంగా తీర్చిదిద్దిన సొసైటీకి అరుణపడి ఉంటానని తెలియజేస్తూ, గురుకుల విద్యాసంస్థలలో చదివిన ప్రతి పూర్వ విద్యార్థి కూడా బాబాసాహెబ్ అంబేద్కర్ సూచించిన మార్గంలో పే బ్యాక్ (టైం / టాలెంట్ / ట్రెజరీ) ఇస్తూ రుణం తీర్చుకోవాలని కోరారు. అదేవిధంగా తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ జనరల్ గురుకులాల్లో చదివిస్తున్నటువంటి విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు అందరు కూడా ఆయా పాఠశాల కళాశాల అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. నేటి నుండి రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ విద్యార్థినీ విద్యార్థులకు కాలేజీలో ప్రారంభం అయినవి కాబట్టి తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ జనరల్ గురుకులాలలో చదివిస్తున్నటువంటి తల్లిదండ్రులు తమ పిల్లలను సకాలంలో కళాశాలలకు పంపించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు.

నేడు కొండగట్టు హనుమాన్ పెద్ద జయంతి

జగిత్యాల జిల్లా ప్రతినిధి జూన్ 02 (ప్రజామంటలు):

జూన్ 01 జగిత్యాల జిల్లా కొండగట్టు ఆలయ ప్రాంగణంలో హనుమాన్ భక్తుల హడావుడి కనిపిస్తుంది. ఈరోజు కొండగట్టు లో హనుమాన్ పెద్ద జయంతి జరుపుకుం టున్నారు.మాల విరమణ కోసం అంజన్న భక్తులు వేలాది సంఖ్యలో కొండగట్టుకు చేరుకుంటున్నారు. దీంతో కొండగట్టు ఆలయ ప్రాంగణం జై శ్రీరామ్ అనే నినాదాలతో ఆలయమంత మోగిపోతుంది, వైశాఖ మాసంలోని దశమి తిథిలో హనుమాన్ జన్మదిన ఉత్సవాలు ఘనంగా జరు పుకుంటారు.జూన్ 1వ తేదీ ఉదయం 7:24 గంటలకు ప్రారంభమై జూన్ 2వ తేదీ ఉదయం 5:04 గంటలకు ముగిసే ఈ తిథి గొప్ప ఆధ్యాత్మిక శక్తిగా పరిగణించబడుతుంది. వేద జ్యోతిషశాస్త్రంలోహనుమంతుడు శని గ్రహం లేదా శనిశ్వరుడి అత్యంత శక్తివంతమైన రూపంగా అభివ్యక్తిగా పరిగణించ బడుతున్నాడు.హనుమంతుడి జన్మది నోత్సవం రోజున పూజలు చేయడం ద్వారా శని చెడు ప్రభావాల ను నుంచి బయటపడవచ్చు.హనుమాన్ జన్మ దినోత్సవ పవిత్రమైన పండుగను తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా జరుపుకుంటున్నారు. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణలోని అన్ని ఆలయాల్లో శనివారం జూన్ 1, 2024 అత్యంత భక్తిశ్రద్ధ లతో జరుపుకుంటున్నారు.ఈ సమయంలో రోజు పూజ చేసి హనుమాన్ మంత్రా లను పఠిస్తారు. 41 రోజుల దీక్ష చివరి రోజున ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు హనుమాన్ ఆలయాల్లో ఘనంగా ఉత్సవాలను జరుపుతారు.ఈ వేడుకలో ప్రధానంగా 'సుందర కాండ' పవిత్రమైన పఠనం. రామాయణంలోని అనేక భాగాలు హనుమం తుడు లంకలో సీతా దేవి కోసం వెతుకుతున్న సమయంలో అతని ధైర్యాన్ని గురించి వివరిస్తాయి.

బాల భక్తాంజనేయ స్వామి ఆలయంలో వైభవంగా హనుమజ్జయంతి ఉత్సవాలు

కరీంనగర్ జూన్ 01 (ప్రజామంటలు):

స్థానిక విద్యానగర్ నవీన కూర్మవాడలోని బాల భక్తాంజనేయ స్వామి దేవాలయంలో ఆంజనేయస్వామి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి.. మయూరగిరి పీఠాధిపతులు జ్యోతిష్య వాస్తు ఆగమశాస్త్ర పండితులు నమిలకొండ రమణాచారి స్వామి వారి ఆధ్వర్యంలో ఉదయం నుండి గణపతి పూజ, పుణ్యాహవాచనము, మంటప ఆరాధనలు, కలశ స్థాపన, 108 కళాశాల ఆరాధన, అర్చనలు మహా పూర్ణాహుతి, పంచామృత పంచసూక్త అభిషేక కార్యక్రమాలు అష్టోత్తర పూజలు వైభవంగా జరిగాయి. 11 మార్లు భక్తులచే హనుమాన్ చాలీసా పారాయణం అత్యంత వైభవంగా జరిగింది.. భగవంతుని ఎవరైతే మనస్ఫూర్తిగా ఆరాధిస్తారో వాళ్ళ జీవితం ఆనందదాయకంగా ఉంటుందని రమణాచార్యులు తెలియపరిచారు. ఆలయ కమిటీ సభ్యులు మరియు జిపి స్వామి అన్నదాన కార్యక్రమం పూజా కార్యక్రమాలను చక్కగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రమేష్ స్వామి, వివేకాచార్యులు, మొదలగు పండితులు, కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సంప్రదాయ రీతిలో ధర్మపురిలో హనుమజ్జయంతి వేడుకలు

రామ కిష్టయ్య సంగన భట్ల



ధర్మపురి జూన్ 01 (ప్రజామంటలు): తెలంగాణ లోని ప్రాచీన పుణ్య క్షేత్రాలలో నొకటియై, పవిత్ర గోదావరీ నదీ తీరాన వెలసి, పలు దేవాలయాల సముదాయంతో అలరారుతున్న పుణ్య తీర్థమైన ధర్మపురి క్షేత్రంలో శని వారం పెద్ద హనుమజ్జయంతి వేడుకలు సంప్రదాయ రీతిలో జరిగాయి. అంజనీ పుత్రుడైన మారుతి శరణు ఘోషలు, జయజయ ధ్వనాలు, భగవ న్నామ స్మరణలు, భక్తి సంగీతాలు, వేద మంత్రాలతో సనాతన క్షేత్రంలో భక్తి పారవశ్యం పొంగి పొర్లింది. ఉదయాత్పూర్వం ప్రత్యే కించి హన్మాన్ దీక్షాపరులు పవిత్ర గోదావరిలో మంగళ స్నానా లను ఆచరించి, దైవ దర్శనాలు చేసుకున్నారు. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానాంతర్గత ఆంజనేయస్వామి ఆలయంలో దేవస్థాన అర్చకులు వొద్దిపర్తి నరసింహ మూర్తి, కళ్యాణ్, వామాన్, కార్తీక్, వేద పండితులు బొజ్జ సంపత్ కుమార్ శర్మ, ముత్యాల శర్మ ఆధ్వర్యంలో, ఈఓ శ్రీనివాస్, ఐ. రామయ్య నేతృత్వంలో, పర్యవేక్షణలో, శ్రీ హనుమాన్ జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి వారికి రుద్రాభిషేకం, మన్యసూక్తం, సుందరాకాండ పారాయణం లతో ప్రత్యేక పూజలు, హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానం కార్యనిర్వహణా ధికారి సంకటాల శ్రీనివాస్, వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ ముత్యాల శర్మ, ప్రవీణ్ కుమార్, ఉపప్రదాన అర్చకులు నేరెళ్ళ శ్రీనివాసాచార్య, స్థానిక వేదపండితులు, అర్చకులు వొద్దిపర్తి నరసింహ మూర్తి , కళ్యాణ్ కుమార్ , నంబి అరుణ్ కుమార్, బొజ్జ రమేశ్ శర్మ, రాజగోపాల్ , అర్చకులు, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు. ఉపవాస దీక్షాదక్షులైన హన్మాన్ భక్తులు దేవస్థానంలో దర్శనాలు చేసుకుని, ప్రసాదాలనుకొని, పరమాన్నాలుగా గ్రహించారు. నదీ తీరాన గోదావరీ భద్రానదీ సంగమ స్థానాన వెలసిన దక్షిణాభిముఖుడైన భక్తాంజనేయ స్వామిని దర్శించు కున్నారు. చారిత్రిక, పౌరా ణిక నేపథ్యాన్ని కలిగిన ఈ ఆలయంలో హనుమజ్జయంతి సందర్భంగా ఉదయం ఆరు గంటలనుండి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, మన్యుసూక్త సంపుటి, సుందరాకాండ పారాయణాది ప్రత్యేక పూజలను అనువంశిక అర్చకులు మధ్వాచారి రాంకిషన్ శర్మ, పవన్ కుమార్ ఆధ్వర్యంలో సాంప్రదాయ వేదోక్త రీతిలో నిర్వహించారు. రామమందిరంలో తాడూరి రఘునాథ్ శర్మ సాంప్రదాయ పూజలనొనరించారు.

హనుమాన్ జయంతి సందర్భంగా ప్రసాద వితరణ

జమ్మికుంట జూన్ 01 (ప్రజామంటలు):

అన్నపూర్ణ ఆర్యవైశ్య సేవా సంస్థాన్ తరఫున హనుమాన్ జయంతి సందర్భంగా జమ్మికుంట రైల్వే స్టేషన్ దగ్గర వాయుపుత్ర హనుమాన్ గుడిలో మరియు అపర భద్రాద్రిగా పేరుగాంచిన ఇల్లందకుంట దేవస్థానం నందు వ్యవస్థాపక అధ్యక్షుడు ఎలుగూరి రమేష్ అధ్యక్షుడు కాసం నాగరాజు, ఉపాధ్యక్షులు గుండా శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ సుద్దాల శ్రీనివాస్ ట్రెజరర్ దొడ్డ వెంకన్న, కండెం వేణు, గుండా కేదారి, దేవునూరి వెంకటేశ్వర్లు, మాడిశెట్టి రాంబాబు, గుడివాడ వెంకట సతీష్, కాసం శ్రవణ్ కుమార్, యాద కార్తీక్, తాటిపల్లి సునీల్, రేణికుంట్ల రాజు, అన్నపూర్ణ ఆర్యవైశ్య సేవా సంస్థాన్ కార్యవర్గ సభ్యులందరూ కలిసి సదా అన్నపూర్ణ మాత సేవలో ప్రసాద వితరణ చేయడం జరిగింది.

హైదరాబాద్ పరిధి ఓట్ల లెక్కింపునకు ఏర్పట్లు

హైదరాబాద్, సికింద్రబాద్ పరిధిలో 16 కౌంటింగ్ కేంద్రాలు

కౌంటింగ్ కేంద్రాల లోపలికి మొబైల్ ఫోన్లు అనుమతి లేదు

కంటోన్మెంట్ ఉపఎన్నిక ఓట్లు17 రౌండ్లలో లెక్కింపు

కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు

నిజాం కాలేజీలో ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్

హైదరాబాద్,జూన్1(ఆర్ఎన్ఎ):

లోక్ సభ ఎన్నికల కౌంటింగ్ కోసం హైదరాబాద్ జిల్లా పరిధిలో అన్ని సిద్ధం చేశామని జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రోస్ తెలిపారు. హైదరాబాద్ , సికింద్రబాద్ పార్లమెంట్ పరిధిలో మొత్తం 16 కౌంటింగ్ కేంద్రాలు ఉన్నాయని అన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశామని వెల్లడించారు. కౌంటింగ్ కేంద్రాల లోపలికి మొబైల్ ఫోన్లు అనుమతి లేదని తెలిపారు. హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో 13 ప్రాంతాల్లో 16 హాల్స్‌లో ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేశామని రొనాల్డ్ రాస్ అన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశామని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లకు అనుమతి లేదని స్పష్టం చేశారు. నిజాం కాలేజీలో ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో 3 చోట్ల పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తామని చెప్పారు. ప్రతి కౌంటింగ్ హాల్‌లో 14 టేబుళ్లు ఏర్పాటు చేశామని తెలిపారు. జూబ్లీహిల్స్‌లో 20 టేబుళ్లు, యాకుత్‌పురాలో 24 రౌండ్లలో, చార్మినార్ నియోజకవర్గంలో 15 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. ఇక కంటోన్మెంట్ ఉపఎన్నిక ఓట్లను 17 రౌండ్లలో లెక్కిస్తామని చెప్పారు. ప్రతి రౌండ్‌కు 30 నిమిషాల సమయం పడుతుందన్నారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఐదు వీవీ ప్యాట్ల స్లిప్పులను లెక్కిస్తామన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక అబ్జర్వర్ ఉంటారని చెప్పారు. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఎన్‌కోర్‌లో డేటా నమోదుచేస్తారన్నారు. కౌంటింగ్ సిబ్బందికి మే 26 నాటికే శిక్షణ పూర్తయిందని తెలిపారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం అవుతుందని 8 గంటల కంటే ముందు పార్టీల ఎజెంట్ల ఆధ్వర్యంలో స్ట్రాంగ్ రూమ్ లు ఓపెన్ చేస్తామని వెల్లడించారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ నాంపల్లి, సికింద్రాబాద్, ఉస్మానియా యూనివర్సిటీలలో ఏర్పాటు చేశామని అన్నారు. అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో 14 టేబుల్స్ ఉంటే జూబ్లీహిల్స్ లో మాత్రం 20 టేబుల్స్ ఏర్పాటు చేశామన్నారు. తొలిఫలితం చార్మినార్ వచ్చే అవకాశం ఉందని మధ్యాహ్నం మూడు గంటల
వరకు పూర్తి ఫలితాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ కు 17 రౌండ్లు ఉంటాయని 12వందల మంది సిబ్బందిని కేవలం కౌంటింగ్ కు వాడుతున్నామని చెప్పారు. ప్రతీ అసెంబ్లీ సెగ్మెంట్‌కు అబ్జర్వర్లు ఉంటారని తెలిపారు. కౌంటింగ్ సిబ్బందికి మే 26 నాటికే శిక్షణ పూర్తయిందని రొనాల్డ్‌రాస్ తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక అబ్జర్వర్ ఉంటారని తెలిపారు.ప్రతి కౌంటింగ్ కేంద్రంలో మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.హైదరాబాద్‌లోని 13 ప్రాంతాల్లో 16 హాల్స్‌లో ఓట్ల లెక్కింపు ఉంటుంది. 3 చోట్ల పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ఉంటుంది. ప్రతి కౌంటింగ్ హాల్‌లో 14 టేబుళ్లు ఏర్పాటు చేశాం. జూబ్లీహిల్స్‌లో అత్యధికంగా 20 టేబుళ్లు ఉంటాయి. యాకుత్‌పురాలో అత్యధికంగా 24 రౌండ్లలో ఓట్ల లెక్కింపు ఉంటుంది. చార్మినార్ నియోజకవర్గంలో 15 రౌండ్లలో, కంటోన్మెంట్ ఉపఎన్నిక ఓట్ల లెక్కింపు 17 రౌండ్లలో జరుగుతుంది. ప్రతి రౌండ్‌కు 30 నిమిషాల సమయం పడుతుంది. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో 5 వీవీ ప్యాట్ల స్లిప్పులు లెక్కిస్తామని రొనాల్డ్‌రాస్ తెలిపారు.

దశాబ్ద కాలం గడిచినా

ఎక్కడ వేసిన గొంగడి అక్కడే...!

తెలంగాణ ఉద్యమకారుడు మహమ్మద్ అంకుష్

జమ్మికుంట జూన్ 01 (ప్రజామంటలు):

తెలంగాణ రాష్ట్ర మలిదశ ఉద్యమంలో మూడున్నర కోట్ల ప్రజల ఆకాంక్ష స్వరాష్ట్ర ఏర్పాటు, దీనికోసం ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో ఉద్యమించి రాష్ట్ర ఏర్పాటుకు సహకరించినటువంటి వాళ్లే, దీనికి అతి ప్రధానమైనది 1200 మంది విద్యార్థుల ఆత్మబలిదానం, ఫలితంగా తెలంగాణ రాష్ట్రం 2014-జూన్ 02న సిద్ధించింది. రాష్ట్ర ఏర్పాటు లో ప్రతి ఒక్కరి శ్రమ, అమరుల త్యాగం ఉన్నది అనేటువంటి విషయాన్ని గుర్తించాలి. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత మొదటిసారిగా ఉద్యమకారుడు అయినటువంటి కెసిఆర్ ఆధ్వర్యంలో తొలి ప్రభుత్వం ఎన్నో ఆశలతో ఏర్పడ్డది. తెలంగాణ ప్రజల బ్రతుకులు మారుతాయి, నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయి, ప్రజలందరికీ విద్యా ఉపాధి అవకాశాలు దొరుకుతాయి. ఎంతో ఆశతో ఎదురుచూసిన కొత్త ప్రభుత్వంలో ప్రజలకు నిరాశే ఏర్పడింది. ఇప్పటివరకు ఉద్యమకారుడైనటువంటి కెసిఆర్, టిఆర్ఎస్ పార్టీ ఇకనుండి రాజకీయ పార్టీగా మారుతుందని తానే స్వయంగా ప్రకటించాడు. మేము రాజకీయం చేస్తాం తప్ప ఉద్యమకారుల యొక్క ఆకాంక్ష మాకు అవసరం లేదు అనేటువంటి భావనను వ్యక్తపరచాడు. కెసిఆర్ యొక్క అసలు స్వరూపం ఒక్కొక్కటి బయటకు రావటం జరుగుతున్నది, ప్రధానంగా తెలంగాణను వ్యతిరేకించినటువంటి నాయకులను తన క్యాబినెట్ లోకి చేర్చుకోవడం, తెలంగాణలో ఇకనుండి ఎటువంటి ధర్నాలు నిరసనలు ఉండద్దు అని ధర్నా చౌక్ ఎత్తివేయటం, తెలంగాణ ఉద్యమానికి జేఏసీ కన్వీనర్ గా ఉన్న కోదండరామును అరెస్టు చేయడం, తెలంగాణ అంటేనే కెసిఆర్ ఫ్యామిలీ అన్నట్టుగా ప్రజల్లో ఒక భ్రమను కల్పించడం, ఆత్మ బలిదానం చేసుకున్నటువంటి ఉద్యమకారుల కుటుంబాలకు ఎటువంటి సహకారం అందించకపోవడం, ముఖ్యంగా శ్రీకాంతాచారి కుటుంబానికి ఎటువంటి రాజకీయ పదవులు ఇవ్వకపోవడం, నిజాం ప్రభువు గోల్కొండ కోట నుండి పరిపాలన సాగించినట్టు, కెసిఆర్ దొర ప్రగతి భవన్ అనేటువంటి గడిని నిర్మించుకొని, దాని చుట్టూతా ఇనుప కంచను ఏర్పాటు చేసుకొని ప్రజలకు, ప్రజాప్రతినిధులకు అనుమతి లేకుండా అందుబాటులోకి రాకుండా చూడటం జరిగింది.అసలు ప్రజలు తమ సమస్యలను చెప్పుకునే పరిస్థితి తెలంగాణలో లేకుండా పోయింది. దీనికి తోడు కెసిఆర్ ఫ్యామిలీ ఇష్టం వచ్చిన రీతిలో భూ ఆక్రమణలు చేయడం, లక్షల కోట్లు దోపిడీ చేయడం బాగా పెరిగిపోయింది. మేము ఏది ఆశించి ఉద్యమం చేసామో ఆ ఉద్యమ ఆకాంక్షలు మాత్రం నెరవేరకుండా పోయాయి. నేటికీ దశాబ్ద కాలం పూర్తయినప్పటికీ నికార్సైన ఉద్యమకారులకు ఎటువంటి లబ్ధి చేకూర లేదు అని చెప్పడంలో ఎటువంటి అతిశయక్తి లేదు. దీనికి తోడు ప్రతిపక్షాలు అనేటివే లేకుండా ఉండాలి అనే నియంతృత్వ ధోరణి, దొరల పోకడ, ప్రశ్నించే ఉద్యమకారుల పైన కేసులు పెట్టి జైల్లో పెట్టడం లాంటివి పరిపాటిగా మారిపోయాయి. దశాబ్ద కాలం పూర్తి అయిన తర్వాత కేసీఆర్ నిజస్వరూపం గమనించిన తెలంగాణ ప్రజలు ఒక్కసారిగా కాళోజీ నారాయణ చెప్పిన సూక్తిని గుర్తుకు తెచ్చుకున్నారు" ప్రాంతేతరుడు మోసం చేస్తే ప్రాంతం అవతలికి తరిమి వెయ్యాలి.. ప్రాంతం వాడే మోసం చేస్తే ప్రాంతంలోనే పాతర పెట్టాలి " అన్న భావాన్ని వొంటపట్టించుకున్న తెలంగాణ ప్రజలు 2023 డిసెంబర్ లో జరిగిన సాధారణ ఎన్నికల్లో కేసీఆర్ పార్టీని భూస్థాపితం చేయటం జరిగింది. దొరల గడిలో బంధీ అయిన తెలంగాణను దశాబ్ద కాలం తర్వాత గడిలా సంకెళ్లు తెంపుకొని స్వేచ్ఛ వాయువులు పీల్చుకున్నంత పని అయింది. మొత్తానికి దశాబ్ద కాలంలో తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగుల పరిస్థితి మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నటువంటి చందంగా మారిపోయింది. ఇకనైనా కొత్త ప్రభుత్వం కొత్త ఆశలు "మార్పు రావాలి కాంగ్రెస్ కావాలి" అనే నినాదంతో వచ్చిన కాంగ్రెస్ పార్టీ సామాన్య ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తాయని, ప్రజా పాలన కొనసాగిస్తారని, కెసిఆర్ చేసిన తప్పులను వీరు చేయరని ఆశిస్తూ తెలంగాణ ఉద్యమ కారులని గుర్తించి పదవులు ఇవ్వాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ను వేడుకుంటు తెలంగాణ ఉద్యమకారుడు మహమ్మద్ అంకుష్ తెలంగాణ ప్రజలకు రాష్ట్ర ఆవిర్భావ ఏర్పాటు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

స్వేరో స్టూడెంట్ నాయకులు దిక్సూచిగా నిలవాలి

బహుజన సమాజం కొరకు ప్రశ్నించే ఎమ్మెల్యే కు అండగా నిలవాలి

హనుమకొండ జూన్ 01 (ప్రజామంటలు):

వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు పై స్వేరో స్టూడెంట్ నాయకులు అనుచిత వాక్యాలు చేయడం సరికాదని వారు చదువుకున్న సంస్కృతిని అధ్యయనం చేసుకొని దళిత బహుజనల గూర్చి మాట్లాడితే బాగుంటుందని తప్పులు తప్పుగా, ఒప్పులు ఒప్పుగా, నిజాలు తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందని తెలంగాణ ప్రైవేటు ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ హనుమకొండ జిల్లా జేఏసీ చైర్మన్ కస్తూరి రవి ఒక ప్రకటనలో తెలిపారు బహుజన నినాదంతో సంపన్న వర్గాలను మోసం చేసి దొరకాళ్ల దగ్గర బాంచనగిరి చేస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ (ఐపీఎస్) స్వేరో పేరుతో బహుజనులను మోసం చేశారని స్వేరో నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేసిన తప్పులు గూర్చి తెలుసుకొని స్వేరో నాయకులు ఆత్మ విమర్శ చేసుకోవాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పదవిలో ఉన్నప్పుడు చేసిన అక్రమాలు బయటపడతాయని భయంతో ముందస్తుగా కేసీఆర్ సలహా తోనే పదవికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చారని లేకపోతే బహుజన సమాజం కొరకు బహుజనులు బాగుండాలని కోరిక తనదైనప్పుడు బీఎస్పీని వీడి దొర దగ్గరికి ఎందుకు వెళ్లాడో స్వేరో నాయకులు అర్థం చేసుకుంటే బాగుంటుంది. చదువు నేర్పిన గురువును తల్లిదండ్రులను మరవకండి కానీ రాజకీయ లబ్ధి కొరకు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాటలు స్వేరో నాయకులు ఎట్టి పరిస్థితుల్లో నమ్మకండి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి ప్రజా పాలనలో ప్రజలకు మేలు చేసే విధంగా సమన్వయం పాటించాలని వారు కోరారు.

తెలంగాణ స్థానిక సంస్థలలో 42 శాతం బిసి రిజర్వేషన్ పరిరక్షణ సామాజిక సాధికారికత సాధించాలి

రాపోలు ఆనంద భాస్కర్

హైదరాబాదు జూన్ 01 (ప్రజామంటలు):

రాష్ట్ర వ్యాప్తంగా క్షేత్ర స్థాయిలో ఆశావహులలో బిసి అభ్యర్థులను, బిసి సంఘాల్లో భాగస్వాములను, వివిధ కులాలలో ప్రొఫెషనల్ అసోసియేషన్ల ప్రతినిధులను సమాయత్త పరిచి, స్థానిక సంస్థలలో 42 శాతం బిసి రిజర్వేషన్ లక్ష్య సాధన కోసం హైదరాబాద్ లో మాజీ ఎం. పి. రాపోలు ఆధ్వర్యంలో జరిపిన సుదీర్ఘ సమాలోచనలో జస్టిస్ చంద్ర కుమార్, మాజీ ఐఎఎస్ అధికారి చిరంజీవులు, వి.జి.ఆర్. నారగోని, ప్రొ. తాటికొండ వెంకట రాజయ్య, ప్రొ. ప్రభంజన్ యాదవ్, అభినవ సర్దార్ సర్వాయి పాపన్న జైహింద్ గౌడ్, తెలంగాణ విఠల్, పృథ్వీరాజ్ యాదవ్, దాసు సురేష్ నేత, నరేందర్ గౌడ్, భాగ్య లక్ష్మి, మారెపల్లి లక్ష్మణ్ నేత, హరిదృఢ, కోల జనార్ధన్, తీగల లక్ష్మణ్ గౌడ్, పోషం అశోక్, తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ వ్యాప్తంగా స్థానిక సంస్థలలో ఆశావహులు, బిసి సంఘాల్లోని క్షేత్ర స్థాయి కార్యకర్తలు, వివిధ కులాల ప్రొఫెషనల్ అసోసియేషన్ల ప్రతినిధులు ఏకమై, పునాదిని కాపాడుకోవడం వంటి రిజర్వేషన్ల పరిరక్షణ కు మండలాల స్థాయిలో సమావేశాలు, ప్రదర్శనలతో ఎలుగెత్తి చాటాలని, ఈ ప్రధానమైన రక్షణ కాపాడుకోవడం బిసి బిడ్డల భవిష్యత్తు తో ముడిపడి ఉందని ముక్తకంఠంతో నిర్ధారించారు.

"సహస్రాబ్దుల అస్తిత్వం.. తెలంగాణకు సొంతం"

రామ కిష్టయ్య సంగనభట్ల
(9440595494)

ధర్మపురి జూన్ 01 (ప్రజామంటలు): పాత రాతి యుగం నుండి ఉనికిని కలిగి, పూర్వ రాతి యుగపు ఆవాసాలకు నిలయమై, షోడశ మహా జన పథాలలో, దక్షిణ ప్రాంత ఏకైక ఆశ్మక జన పథాన్ని అంతర్భాగంగా కలిగి, అఖండ భారతావనిలో, ప్రత్యేక స్థానం పొందింది తెలంగాణ ప్రాంతం. రామాయణ-మహాభారత కాలానికి చెందిన చారిత్రక ఆనవాళ్ళున్న ప్రదేశమిది. బుద్ధుని కాలాన బోధన్ ప్రాంత పాలకునిగా సుజాతుడు ఉన్నట్లు, బుద్ధుని సమకాలికుడైన బావరి, బాదన కుర్తిలో స్థిరపడినట్లు, మత్స్య పురాణ ఆధారంలో మంజీరా నది ప్రస్తావన, పైఠాన్ రాజధానిగా, ఉత్తర.... దక్షిణాలకు ప్రధాన మార్గాన్ని కలిగిన "ములక" రాజ్యం గోదావరి నది హద్దు వరకూ విస్తరించినట్లు, మగధ సామ్రాజ్యం బల పడ్డాక, ఆశ్మక సైతం, మగధలో, విలీనమైనట్లు చరిత్రకారులు నిరూపించారు. నందుల కాలానంతరం, మౌర్యుల హయాంలో పర్యటించిన, చైనా యాత్రికుడు మెగస్తనీసు పేర్కొన్న, 30 బలిష్ట దుర్గాలలో కదంబాపూర్, బోధన్, పిధుండ, ముషిక, ధూళికట్ట, పెద్దబొంకూర్, ఫణిగిరి, కొండాపూర్, శాతవాహన చక్రవర్తుల తొలి రాజధాని కోటిలింగాల, చోటుచేసుకోవడాన్ని బట్టి ఈ ప్రాంత చారిత్రక ప్రాధాన్యత స్పష్టం అవుతున్నది. శాతవాహనుల అనంతరం తెలంగాణ ప్రాంతాన్ని పాలించిన రాజ్యం లేకపోగా, ఇక్ష్వాకుల పాలనలో తూర్పు ప్రాంతాలు విజయపురి రాజధానిగా, వాకాటుల ప్రారంభ కాలంలో ఉత్తర తెలంగాణ ఉండగా, ప్రవర సేనుడి కాలాన తెలంగాణ మొత్తం రాజన్యుల ఏలు బడికి రాగా, తరువాతి "విష్ణుకుండినుల జన్మభూమి తెలంగాణయే" అని ప్రఖ్యాత చారిత్రక పరిశోధకుడు బి. ఎన్. శాస్త్రి నిరూపించారు. బాదామి చాళుక్యుల పాలనలో తెలంగాణ మొత్తం ఉండగా, రాష్ట్రకూట, బాదామి చాళుక్య, చోళ, కాకతీయ, కుతుబ్ షాహీల ఏలు బడులలో, ఎన్నో ఒడిదుడుకులు అనుభవించి, తన ఉనికి చాటుకుంది ఈ నేల. 1947 ఆగస్టు 15న మన దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించినా, నిజాం పాలనలో ఉన్న తెలంగాణ ప్రాంతం స్వేచ్ఛా వాయువులను పీల్చ లేకపోయింది. 1948 సెప్టెంబర్ 17న పోలీసు చర్య ఫలితంగా, తెలంగాణ విమోచనోద్యమానికి ముగింపుగా భారతావనిలో అంతర్భాగమైంది. 1724 - 1948 మధ్యకాలంలో 224 ఏళ్ల పాటు, ఎనిమిది తెలంగాణ జిల్లాలు, ఐదు మరట్వాడా జిల్లాలు, 3 కర్ణాటక జిల్లాలతో కలిపి 16 జిల్లాల హైదరాబాద్ రాష్ట్రం, మూడు భాషలలో కొనసాగింది. 1948 సెప్టెంబర్ 13న పోలీసు చర్య నేపథ్య ఫలితంగా మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ లొంగి పోవడంతో, హైదరాబాద్ రాష్ట్రం భారత ప్రభుత్వ పాలనలో విలీనమైంది. వరంగల్ నుండి కొంత ప్రాంతం, గోదావరి జిల్లాల నుండి భద్రాచలం, దండకారణ్య ప్రాంతం వేరు చేస్తూ ఖమ్మం జిల్లాను రూపొందించారు. 1948 నుండి 1952 వరకు ప్రజాస్వామ్య ప్రభుత్వం లేని కారణాన, మిలిటరీ సివిల్ అధికారుల పాలనలో, ఇంగ్లీష్ భాష రాదన్న సాకుతో, మదరాసు రాష్ట్రంలోని ఆంధ్ర ప్రాంతం నుండి, ముల్కీ నిబంధనలను ఉల్లంఘించి, అధిక సంఖ్యాకులకు ఉద్యోగాలు కల్పించడం జరిగింది.

నిజాం పాలనలో ఉత్తరాది వారికి ఉద్యోగాలలో పెద్ద పీట వేసిన నేపథ్యంలో, స్థానికులకు ఉపాధి ఆకాశాలు దక్కాలని 1910 - 1918 మధ్యకాలంలో ప్రజలు ఉద్యమించడంతో, మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ 1919లో ముల్కీ నిబంధనలు ప్రవేశ పెట్టారు.1956లో ఆంధ్ర, హైదరాబాద్ ప్రాంతాలు విలీనమయ్యాక, వలసలు మరింత అధికమైనాయి. స్వార్థ రాజకీయాల ఫలితంగా, ముల్కీ నిబంధనలు అమలు కాని స్థితిలో, 1969లో మర్రి చెన్నారెడ్డి నేతృత్వంలో, ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఉద్భవమైంది. 1969 జనవరి 5న తెలంగాణ ఉద్యోగులు.... ఖమ్మం జిల్లా పాల్వంచలోని ధర్మల్ స్టేషన్లో పనిచేస్తున్న ఉద్యోగులలో అధికులు ఆంధ్రా వారు కావడంతో నిరసనలకు దిగారు. "తెలంగాణ రక్షణ సమితి" ఆధ్వర్యంలో పలు తీర్మానాలు చేశారు. ఉద్యమం లోనికి ఉస్మానియా విశ్వ విద్యాలయ విద్యార్థులు ప్రవేశించారు. జనవరి 13న ఉస్మానియాలో "తెలంగాణ విద్యార్థుల కార్యాచరణ సమితి" రూపుదాల్చింది. మెడికల్ విద్యార్థి మల్లికార్జున్ ను నాయకునిగా ఎన్నుకున్నారు. జనవరి 20న తొలిసారి విద్యార్థులపై కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం "జస్టిస్ భార్గవ కమిటీ"ని వేసింది. జనవరి 22న తెలంగాణ రక్షణల అమలుకు జీవో జారీ అయింది. ఫిబ్రవరి 28 లోగా నాన్ ముల్కీ ఉద్యోగులను తిరిగి పంపుతామని, జీవో ను నిర్లక్ష్యం చేసే అధికారులపై, కొరడా ఝుళిపిస్తామని, ప్రభుత్వం హెచ్చరించింది. జనవరి 24న సదాశివపేటలో జరిగిన కాల్పులలో 14 మంది మరణించారు. గాయపడి గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందిన 17ఏళ్ల శంకర్ తెలంగాణ ఉద్యమంలో తొలి అమరుడైనాడు. కాల్పులకు నిరసనగా కొండా లక్ష్మణ్ బాపూజీ రాజీనామా చేశారు. జూన్ 4న అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ హైదరాబాద్ వచ్చి, విద్యార్థి, ప్రజాసమితి నేతలతో చర్చలు జరిపారు. ఉద్యమంలో 369 మంది అసువులు బాసినా, మృతుల సంఖ్య 57 అని అధికారులు పేర్కొన్నారు. ప్రజాబలం అండగా, విద్యార్థుల ఉద్యమాల ఫలితంగా, 1971లో 12 లోక్ సభ సీట్లలో పదకొండింటికి సాధించిన తెలంగాణ ప్రజా సమితి (టిపిఎస్) ఇందిరా గాంధీతో చర్చల అనంతరం కాంగ్రెస్ లో విలీనమైంది. 1979 లో హైదరాబాద్ నుండి రంగారెడ్డి జిల్లా ఆవిర్భావం జరిగింది.

తరువాత కేసిఆర్ 2001 ఏప్రిల్ 21 నాడు తెలుగుదేశం పార్టీ సభ్యత్వానికి, డిప్యూటి స్పీకర్ పదవికి రాజీనామా సమర్పించి 2001 ఏప్రిల్ 27న నూతనంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం నినాదంతో "తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీని ఏర్పాటు చేశారు". తొలిదశ తెలంగాణ ఉద్యమం, మలిదశలో తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ ప్రారంభించిన కార్యక్రమాలు కేసీఆర్‌ని ప్రభావితం చేశాయి.

2001లో కొత్తగా ఉత్తరాఖండ్, జార?ండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ఏర్పాటు తెలంగాణ ఏర్పాటు ఏమీ అసాధ్యం కాదన్న అభిప్రాయం ఏర్పరిచింది.మలి దశలోకి అడుగుపెట్టిన తెలంగాణ ఉద్యమానికి కేసీఆర్ తెరాస స్థాపన అన్నది రాజకీయమైన వ్యక్తీకరణ అయింది. తెరాసను స్థాపించిన 20 రోజులకు 2001 మే 17న కరీంనగర్ లో "తెలంగాణ సింహగర్జన" పేరిట భారీ బహిరంగ సభ ఏర్పరిచి, తెలంగాణను రాజకీయ పోరాటం ద్వారా సాధిస్తామని ప్రకటించారు. కల్వకుంట్ల చంద్రశేఖర రావు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర లక్ష్య సాధనతో "తెరాస", భూమికగా, వివిధ వర్గాల సహకారంతో ఉద్యమాన్ని నడిపారు. తెలంగాణకు జరిగిన జరుగుతున్న అన్యాయాన్ని తెలంగాణ వాసులకు వివరించి, చైతన్యవంతులను చేసే ఈ కార్యక్రమంలో క్రమానుగతంగా సఫలీకృతులయ్యారు. 2009 నవంబరు 29న కేసీఆర్ తెలంగాణ సాధన లక్ష్యంగా ఆమరణ నిరాహారదీక్ష చేపట్టారు. చేపట్టడానికి కరీంనగర్ నుండి సిద్ధిపేట దీక్షాస్థలికి బయలు దేరుతుండగా, మధ్యలో కరీంనగర్ దగ్గరలోని అలుగునూరు వద్ద పోలీసులు అరెస్టుచేసి, ఖమ్మం పట్టణానికి తరలించారు. అదే రోజున పోలీసులు దీక్ష భగ్నం చేసి ఖమ్మం సబ్ జైలుకు తరలించి

29, 30 తేదీల్లో బంధించారు. 30న జైల్లోనే నిరాహార దీక్ష కొనసాగించడంతో అక్కడ నుంచి ప్రభుత్వాసుపత్రికి కేసీఆర్‌ని తరలించారు. 2009 డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైనట్లు యూపీఏ ప్రభుత్వం ప్రకటించింది. 2010లో లో శ్రీకృష్ణ కమిటీ ఏర్పాటు 6 ప్రధాన సిఫార్సులు చేసింది. 2009 డిసెంబర్ 3న ప్రారంభమైన మలి దశ ఉద్యమంలో, ఆత్మ త్యాగం చేసిన తొలి అమరుడు శ్రీకాంతాచారి.

కేసిఆర్ కార్య దీక్షకు తోడుగా, 2011లో ఏర్పాటైన "రాజకీయ ఐక్య కార్యాచరణ సమితి" (పొలిటికల్ జేఏసీ) సహకారంతో విద్యార్థులు, ఉద్యోగులు, మేధావులు, రచయితలు, కవులు, కళాకారులు, కార్మికులు, కుల సంఘాల బాధ్యులు పోరాటంలో దూకారు. ఆత్మబలిదానాలు, సబ్బండ వర్ణాల ఆకాంక్షలు బహిర్గతమై, అధికార కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు చేసిన ఆందోళనతో, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది.

"సకల జనుల సమ్మె", "మిలియన్ మార్చ్" ఆందోళనలు, ఉధృతం అయినాయి.

2013 జూలై 30న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సోనియా గాంధీ మార్గ నిర్దేశంతో, తెలంగాణ రాష్ట్రం ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేసి, 2013 అక్టోబర్ 3న కేంద్ర మంత్రి మండలి ఆమోద ముద్ర వేసింది.

2014, ఫిబ్రవరి 18న తెలంగాణ ఏర్పాటు బిల్లుకు భారతీయ జనతా పార్టీ మద్దతుతో లోకసభ ఆమోదం లభించింది. ఫిబ్రవరి 20న రాజ్యసభ ఆమోదం పొందింది. 2014 మార్చి 1న బిల్లుపై రాష్ట్రపతి ఆమోదం లభించింది.

2014 జూన్ 2న భారతదేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించింది. కేసిఆర్ నేతృత్వంలోని తెరాస తొలి, మలి ప్రభుత్వాలు ఏర్పాటు చేసి పరిపాలన చేయగా, ఇటీవలి సాధారణ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి, రేవంత్ రెడ్డి నేతృత్వంలో కొత్త ప్రభుత్వం కొలువు తీరి పాలనా పగ్గాలు చేపట్టింది.

బరాక్ ఒబామా అత్త మృతి

న్యూయార్క్,జూన్1(ప్రజా మంటలు):
అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఇంట తీవ్ర విషాదం నెలకొంది. మాజీ ఫస్ట్‌లేడీ, ఒబామా సతీమణి మిచెల్ ఒబామా తల్లి మరియన్ రాబిన్సన్ శుక్రవారం కన్నుమూశారు. ప్రస్తుతం ఆమె వయసు 86. ఈ విషయాన్ని బరాక్, మరియన్ కుటుంబ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. బరాక్ ఒబామా అమెరికా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో కుమార్తె, అల్లుడితో కలిసి మరియన్ శ్వేత సౌధంలోనే ఉన్నారు. ఒబామా ఇద్దరు పిల్లలు మాలియా, సాషా సంరక్షణను ఆమే చూసుకున్నారు. మరియన్‌ను కుటుంబ సభ్యులు ముద్దుగా 'మొదటి బామ్మ' అని పిలుచుకుంటారు. మరియన్ మృతితో ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఈ విషయం తెలుసుకున్న పలువురు మరియన్ మృతికి సంతాపం తెలుపుతున్నారు.

పవన్ గెలుపు కోరుతూ మోకాళ్లపై తిరుపతి కొండకు

కాకినాడ,జూన్1(ప్రజా మంటలు):
ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ గెలవాలని కోరుతూ తూర్పుగోదావరికి చెందిన ఓ యువతి మోకాళ్లపై తిరుపతి మెట్లు ఎక్కారు. వివరాల్లోకి వెళ్తే.. ఉండ్రాజవరానికి చెందిన పసుపులేటి దుర్గా రామలక్ష్మి స్థానికంగా ఆర్ఎంపీ వైద్యం చేస్తుంటారు. పవన్ అంటే చాలా అభిమానం. పవన్‌కల్యాణ్ గెలవాలని తిరుమల వెంకటేశ్వరస్వామికి మొక్కుకున్నారు. అందులో భాగంగా మే 25న సుమారు 450 మెట్లు మోకాళ్లపై ఎక్కినట్లు శుక్రవారం ఆమె తెలిపారు. పార్టీలతో తనకు సంబంధం లేదని, కేవలం పవన్‌పై ఉన్న అమితమైన అభిమానంతోనే మెట్లు ఎక్కినట్లు వివరించారు. పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న ఆయన అత్యధిక మెజార్టీతో కచ్చితంగా విజయం సాధిస్తారని దీమా వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు వెంకటేశ్వరరావు, భవానీల అనుమతితో తిరుమల వెళ్లి మొక్కు తీర్చుకున్నట్లు వివరించారు.

కారులో తరలిస్తున్న కోటిన్నర స్వాధీనం

కడప,జూన్1(ప్రజా మంటలు):
వైఎస్సార్ జిల్లా చింతకొమ్మదిన్నె మండలం జయరాజ్ గార్డెన్స్ సమీపంలోని చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. కారులో తరలిస్తున్న రూ.1.5 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. ప్రొద్దుటూరుకు చెందిన తిరుమలయ్య అనే బంగారు వ్యాపారి నగదును చెన్నైకి తరలిస్తున్నట్లు గుర్తించారు. ఎలాంటి బిల్లులు లేకపోవడంతో ఆయన వద్ద ఉన్న నగదును స్వాధీనం చేసుకుని ఐటీ అధికారులకు అప్పగించారు. ఈ ఘటనపై డీఎస్పీ బృందం దర్యాప్తు చేస్తోంది.

విత్తనాలు, ఎరువుల విక్రయాల్లో నిబంధనలు పాటించాలి

వీరఘట్టం,జూన్1(ప్రజా మంటలు):
విత్తనాలు, ఎరువుల విక్రయాల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ ఏడీ కె. రత్నకుమారి అన్నారు. స్థానిక రైతుభరోసా కేంద్రం లో శనివారం ఎరువుల దుకాణాల డీలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. దుకాణాల్లో నిల్వ బోర్డు లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎమ్ఆర్పీకి మించి విత్తనాలు, ఎరువులు విక్రయించకూడదని డీలర్లకు సూచించారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని చెప్పారు. ఈ సమావేశంలో ఏ వో సౌజన్య పాల్గొన్నారు.

మహిళను బెదిరించి హోంగార్డ్ అత్యాచారం ఫిర్యాదుతో పోలీసుల కేసు నమోదు

విజయనగరం,జూన్1(ప్రజా మంటలు):
రక్షించాల్సిన పోలీసులే.. భక్షకులుగా మారుతున్నారు. కన్ను మిన్ను కానకుండా స్త్రీలపై తమ కామవాంఛ తీర్చుకుంటున్నారు. బైక్‌పై వెళుతున్న ఓ జంటను పోలీస్ వాహనంలో తన స్నేహితుడితో కలిసి వచ్చిన ఓ హోంగార్డ్ అడ్డగించి, బెదిరించి మహిళను తుప్పల్లోకి తీసుకువెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాధితురాలు చేసిన ఫిర్యాదు మేరకు దిశ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం నుంచి కుమిలి వెళ్లే రహదారిలో బైక్‌పై తన కుటుంబసభ్యుడితో కలిసి వెళ్తున్న సుమారు 45 ఏళ్ల వయసు కలిగిన మహిళను చూసిన హోంగార్డ్, అతని స్నేహితుడు పోలీస్ వాహనంపై వాని వెనుక వెళ్లి కుమిలి వెళ్లే రహదారిలో నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతం వద్ద బైక్‌ను ఆపారు. అనంతరం బైక్‌పై ఉన్న వ్యక్తిని హోంగార్డ్ బెదిరించి, అక్కడే తన స్నేహితుడిని ఉంచి, మహిళను సమీప పొదల్లోకి తీసుకువెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఫిర్యాదుతో దిశ పోలీసులు కేసు నమోదుచేశారు. అయితే లైంగికదాడికి పాల్పడిన హోంగార్డ్ ఎవరనేది ఇంకా నిర్ధారణ కాలేదని, త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని దిశ సీఐ నాగేశ్వరరావు తెలిపారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్ హాల్‌టిక్కెట్లు విడుదల

హైదరాబాద్,జూన్1 (ప్రజా మంటలు):
తెలంగాణలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు టీజీపీఎస్సీ ఏర్పాట్లు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా శనివారం హాల్‌టికెట్లను విడుదల చేసింది. జూన్ 9న ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1గంట జరిగే ఈ పరీక్ష రాసే అభ్యర్థులు కమిషన్ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. రాష్ట్రంలో 563 గ్రూప్-1 పోస్టుల భర్తీ కోసం ఫిబ్రవరి 23 నుంచి మార్చి 16 వరకు ఆన్‌లైన్లో దరఖాస్తులు స్వీకరించగా.. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 4.03 లక్షల మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. పరీక్ష రోజు ఉదయం 9గంటల నుంచే పరీక్ష కేంద్రాల్లోకి అభ్యర్థుల్ని అనుమతించనున్నారు. పది దాటితే పరీక్ష కేంద్రం గేట్లు మూసివేస్తామని.. ఆ తర్వాత ఎవరినీ లోపలికి అనుమతించేది లేదని అధికారులు స్పష్టంచేశారు.

పిల్లల టాయ్స్..లంచ్ బాక్సుల్లో డ్రగ్స్

అహ్మదాబాద్‌లో పట్టుకున్న పోలీసులు

అహ్మదాబాద్,జూన్1 (ప్రజా మంటలు):
డ్రగ్స్‌ను సరఫరా చేసేందుకు స్మగ్లర్లు వినూత్న రీతిలో ఆలోచిస్తున్నారు. డబ్బుల కోసం ఎంతటి సాహసానికైనా వెనుకాడటం లేదు. అయితే.. ఈసారి స్మగర్లు చిన్న పిల్లల లంచ్ బాక్స్ లో డ్రగ్స్ ను సరఫరా చేసేందుకు సిద్ధమయ్యారు. కానీ.. ఆ బాక్స్ కస్టమ్ అధికారుల కంటపడింది. అందులో ఏముందోనని తెరిచి చూడగా.. రూ. కోటి కంటే ఎక్కువ విలువ చేసే డ్రగ్స్ లభ్యమైంది. శనివారం అహ్మదాబాద్‌లో చిన్నారుల బొమ్మలు, చా÷-లకెట్లు, లంచ్ బాక్స్‌లు, క్యాండీ విటమిన్‌లలో దాచి ఉంచిన రూ. 1.15 కోట్ల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఒక స్మగ్లర్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విదేశాల నుంచి వచ్చిన వారి నుంచి సుమారు రూ.కోటికిపైగా విలువైన డ్రగ్స్‌ను కస్టమ్స్ అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. అహ్మదాబాద్ క్రైమ్ బ్రాంచ్‌తోపాటు కస్టమ్స్, ఎక్సైజ్ శాఖ అధికారులు సంయుక్త ఆపరేషన్ చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో చిన్నారుల ఆట బొమ్మలు, చాక్లెట్లు, లంచ్ బాక్స్‌లు, క్యాండీ విటమిన్‌లల్లో దాచి అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ.1.15 కోట్ల విలువైన డ్రగ్స్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

టీజీఎస్పీగా మారిన పోలీస్ శాఖలోగో

హైదరాబాద్,జూన్1(ప్రజా మంటలు):
రాష్ట్ర ప్రభుత్వం టీఎస్ స్థానంలో టీజీని అధికారికంగా మార్చిన క్రమంలో..ప్రభుత్వ నిర్ణయానికి తగ్గట్లుగా పోలీస్ శాఖలోనూ అధికారులు లోగోలను మారుస్తున్నారు. అందులో భాగంగానే ఇప్పటి వరకు టీఎస్ఎస్పీగా ఉన్న లోగోను టీజీఎస్పీగా మార్చారు. టీజీఎస్పీ లోగో మార్పును ఆ విభాగం అధికారిక సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు. టీఎస్ఎస్పీ బెటాలియన్ల లోగోలు సైతం టీజీఎస్పీ బెటాలియన్లుగా లోగోల్లో మార్పులు చేశారు. ప్రభుత్వ నిర్ణయానికి తగ్గట్లుగా త్వరలోనే పోలీస్ శాఖలోని మిగతా విభాగాల లోగోల్లోనూ మార్పులు చోటు చేసుకోనున్నాయి.

రెమాల్ తుఫాన్ బాధిత కుటుంబాలకు పరిహారం

ఒక్కో కుటుంబానికి 2 లక్షల చొప్పున చెల్లింపు

న్యూఢిల్లీ,జూన్1 (ప్రజా మంటలు):
బంగాళఖాతంలో ఏర్పడిన రెమాల్ తుపాన్ కారణంగా ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. ఘటనలో చనిపోయిన కుటుంబాలకు రూ.2 లక్షలు ఇస్తామని ప్రధాని మోదీ ప్రకటించారు. తుపాన్ ధాటికి అస్సాం, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, త్రిపుర, పశ్చిమ బెంగాల్‌లలో చాలా మంది మరణించారు. వారందరికీ రూ.2 లక్షల పరిహారం అందించనున్నారు. గాయపడిన వారికి రూ. 50 వేలు ఇవ్వాలని నిర్ణయించారు. తుపాను ప్రభావంతో ఈశాన్య రాష్ట్రాలలో 40 మంది మరణించారు. రెండు లక్షల మందికి పైగా నిరాశ్రయులయ్యారు.' రెమల్ తుపాను అస్సాం, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, త్రిపుర, పశ్చిమ బెంగాల్‌లపై తీవ్రంగా ప్రభావం చూపింది. మరణించిన వారికి తీవ్ర సంతాపం తెలియజేస్తున్నాను. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని రకాలుగా సహకారం అందిస్తుంది' అని ప్రధాని మోదీ ఎక్స్‌లో పేర్కొన్నారు. రెమల్ తుపాన్ ప్రభావంతో పశ్చిమ బెంగాల్‌లో, కక్‌ద్వీప్, నమ్‌ఖానా, ఫ్రేజర్‌గంజ్‌తో సహా అనేక తీర ప్రాంతాలలో ఆస్తులు, వ్యవసాయ భూములకు నష్టం వాటిల్లింది. దక్షిణ కోస్తా ప్రాంతాల్లోని 24 బ్లాక్‌లు, 79 మున్సిపల్ వార్డుల్లో దాదాపు 15 వేల ఇళ్లు దెబ్బతిన్నాయని అధికారులు చెబుతున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఇంఫాల్‌లోని అనేక ప్రాంతాలలో భారీ వరదలు సంభవించిన తరువాత రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. నది ఒడ్డున కట్టలు తెగిపోవడంతో వరదలు వచ్చాయి. దీంతో మణిపుర్ ప్రభుత్వం మే 30, 31 తేదీలలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులను ప్రకటించింది. అత్యవసరమైతే తప్పా ప్రజలు బయటకి రావద్దని హెచ్చరించింది.

చంద్రబాబు విదేశీ పర్యటనపై గోప్యత ఎందుకు?

ఎన్నికల్లో దోచుకున్న సొమ్ము దాచుకోవడానికేనా

మంత్రి జ.ఓగి రమేశ్ ఘాటు విమర్శలు

అమరావతి,జూన్1(ప్రజా మంటలు):
: చంద్రబాబు విదేశీ పర్యటన మిలియన్ డాలర్ల ప్రశ్న అని మంత్రి జోగి రమేష్ అన్నారు. ఏ దేశానికి వెళ్ళాడో.. ఎక్కడికి వెళ్ళాడో పార్టీ నేతలకు సైతం తెలియదని, విదేశీ పర్యటన ఇంత గోప్యంగా ఉంచాల్సిన అవసరం ఏంటని మంత్రి జోగి రమేష్ అన్నారు. ఎన్నికల్లో దోచుకున్న డబ్బులు దాచుకోడానికి వెళ్లాడు కనుకే ఇంత రహస్యమన్నారు. విదేశాల్లో పెట్టుబడులు పెట్టడానికి వెళ్లారో ప్రజలకు చెప్పాలి. ఏ దేశం వెళ్లినా ఒక ఫోటో దిగి పంపించే చంద్రబాబు.. ఈసారి ఎందుకు ఫోటోలు కూడా పంపలేదు?. అసలు ఈ పది రోజులు ఎక్కడకు వెళ్లారో ఎందుకు చెప్పటం లేదని అనుమానాలు వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నాయకుడు కాబట్టి ఆయన పర్యటన గురించి ప్రజలకు అవసరం. ఏబీ వెంకటేశ్వరావు టీడీపీ తొత్తు కాదా..? అని ఆయన ప్రశ్నించారు. పరికరాల కొనుకోలు స్కాంలో కేంద్ర నిఘా వ్యవస్థ కూడా పాత్ర ఉందని నిర్ధారించిందని, ఏబీ వెంకటేశ్వరావు ఒంటిపై బట్టలు మాత్రమే ఖాకీ.. లోపల అంతా యెల్లో నే అని ఆయన అన్నారు. ఏబీ వెంకటేశ్వరావు చరిత్ర ప్రజలకు తెలుసు.. నిన్నటితో మరింతగా నిజస్వరూపం బయటపడిందన్నారు. ఎగ్జిట్ పోల్స్ తో కూటమి దిమ్మ తిరిగి బొమ్మ కనబడబోతుందని, జూన్ 4 తేదిన చంద్రబాబుకి మూర్ఛ వచ్చి హాస్పిటల్ లో చేరడం తథ్యమన్నారు. వైసిపి మళ్ళీ భారీ మెజారిటీ తో గెలవడం ఖాయమని, వైసీపీ శ్రేణులంతా సంబరాలకు సిద్ధం అవ్వండని మంత్రి జోగి రమేష్ అన్నారు.

భయం లేదు..మళ్లీ బిజెపిదే అధికారం

మోడీ ధ్యానంపై విపక్షాల విమర్శలు దారుణం

బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా

న్యూఢిల్లీ,జూన్1 (ప్రజా మంటలు):

ఈ నెల 4 వ తేదీన వెలువడే లోక్ సభ ఎన్నికల ఫలితాలపై ఆందోళన అవసరం లేదని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తెలిపారు. దేశ ప్రజలందరూ ప్రధాని నరేంద్ర మోడీ వైపే ఉన్నారని చెప్పారు. ఇక, దేశంలో బీజేపీ మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతుందని జోస్యం చెప్పుకొచ్చారు. ఎన్డీయే 400 సీట్లకు పైగా గెలుస్తుందనే ఆయన ధీమా వ్యక్తం చేశారు. దేశానికి మోడీ అవసరముందని ప్రజలు గ్రహించారు.. అందుకే, మాకు ఈ సారి భారీ మేజార్టీ రాబోతుందన్నారు. చింద్వారా సీటుతో సహా మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో అన్ని స్థానాలను గెలుస్తాం.. రాజస్థాన్ లోనూ మెరుగైన ఫలితాలు వస్తాయని జేపీ నడ్డా వెల్లడించారు. కాగా, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ధ్యానంపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలపై కూడా జేపీ నడ్డా స్పందించారు.. వారికి ఆధ్యాత్మిక విషయాలు పూర్తిగా తెలియవు.. వారు కేవలం పొలిటికల్ టూరిస్టులు మాత్రమేనంటూ మండిపడ్డారు. కేవలం ఎన్నికల టైంలోనే మతపరమైన పర్యటనలు చేస్తారంటూ నడ్డా ఎద్దేవా చేశారు. ప్రతిపక్షాలు ఎన్నికలను వర్గీకరించి ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దక్షిణాదిలోనే బీజేపీ అన్ని రికార్డులను బద్దలు కొడుతుందని విశ్వాసం మాకు ఉందన్నారు. తెలంగాణ. తమిళనాడులో ఓట్ల శాతం గణనీయంగా పెరిగింది.. ఇక్కడి ప్రజలు మోడీ నాయకత్వంలో కొత్త మార్పులను చూసేందుకు సిద్ధంగా ఉన్నారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా చెప్పుకొచ్చారు.

పాలేరుకు సీసీ రోడ్డు ఇచ్చే బాధ్యత నాదే

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ

హైదరాబాద్,జూన్1(ప్రజా మంటలు):
పాలేరు నియోజకవర్గంలో ప్రతి ఇంటి ముందు ఎన్ని కోట్లు ఖర్చైనా సీసీ రోడ్డు ఇచ్చే బాధ్యత నాదే అని రెవెన్యూ, ఐ అండ్ పీఆర్, గృహ నిర్మాణం శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పాలేరు నియోజకవర్గంలో రెండు నెలల్లో హై టెన్షన్ వైర్లని తొలగిస్తానని తెలిపారు. కొత్త రేషన్ కార్డు కొత్త పెన్షన్ లేదు రాబోయే కొద్ది రోజుల్లో మీ పేదోడి ప్రభుత్వం కార్డుతో పాటు పెన్షన్ కూడా ఇవ్వడం జరుగుద్దని మీకు తెలియజేస్తున్నా అన్నారు. ఆరోగ్య విషయంలో చదువుల విషయంలో ఎంత ఇబ్బంది వచ్చినా ఈ ప్రభుత్వం పెద్దపేట రెండిటికీ ఏసింది అని కూడా మీకు చెప్తున్నా అన్నారు. పేదోళ్లకు ఇళ్ల స్థలం యిచే బాధ్యత నాది అని తెలుపుతన్న అన్నారు. అతి కొద్ది రోజుల్లో పాలేరు నియోజకవర్గా పేద ప్రజల కోసం కార్పొరేట్ హాస్పిటల్ కట్టిస్తా అన్నారు. ఎలక్షన్ కోడ్ అయిపోగానే కబ్జా కి గురైన ప్రతి ప్లాటిని వెలికి తీస్తా అన్నారు. నా వాళ్లు మీ వాళ్ళు అనే తేడా లేకుండా నాకోసం పనిచేసిన నాయకులైన ఎవరిని ఉపేక్షించేది లేదు ప్రతి స్థలాన్ని వెలికి తీసే బాధ్యత నాదన్నారు. పాలేరు నియోజకవర్గం లో ప్రతి ఇంటి ముందు ఎన్ని కోట్లు ఖర్చైనా సీసీ రోడ్డు ఇచ్చే బాధ్యత నాదే అన్నారు. గ్రామాల్లో రోడ్లు వెడల్పు చేయాలంటున్నారు రోడ్డుకి ఇరు ప్రక్కల ఉన్న ప్రజలు సహకరిస్తే ఎంత ఖర్చైనా రోడ్లు వెడల్పు చేస్తానని తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్లపై వైకాపాకు ఎదురుదెబ్బ

ఇసి ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమన్న హైకోర్టు

అమరావతి,జూన్1 (ప్రజా మంటలు):
పోస్టల్ బ్యాలెట్ల విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ వైకాపా దాఖలు చేసిన పిటిషన్‌ను ఏపీ హైకోర్టు కొట్టి వేసింది. సీఈసీ ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది. ఏపీలో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు సమయంలో ఓటరు డిక్లరేషన్‌కు సంబంధించిన 'ఫారం- 13ఏ'పై అటెస్టింగ్ అధికారి పేరు, హోదా, సీలు లేకపోయినా పర్వాలేదు, ఆ అధికారి సంతకం ఉంటే చాలు వాటిని పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేస్తూ సీఈసీ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. దీని ఆధారంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) ఈ నెల 25, 27వ తేదీల్లో జారీ చేసిన మెమోలను సవాలు చేస్తూ వైకాపా ఉన్నత న్యాయస్థానంలో వ్యాజ్యం వేసింది. ఈసీ ఇచ్చిన మార్గదర్శకాలకు భిన్నంగా రాష్ట్ర సీఈఓ జారీ చేసిన ఉత్తర్వులున్నాయన్నారు. పోస్టల్ బ్యాలెట్‌పై అటెస్టేషన్ లేకపోతే వాటిని తిరస్కరించడం తప్ప వేరే మార్గం లేదన్నారు. చెల్లని ఓట్లను పరిగణనలోకి తీసుకోవాలన్నట్లు సీఈఓ ఉత్తర్వులున్నాయన్నారు. మెమోల అమలును నిలుపుదల చేయాలని కోరారు. పిటిషనర్ వాదనలు హైకోర్టు తోసిపుచ్చింది. గతంలో ఇచ్చిన కోర్టు తీర్పులను ప్రస్తావించింది.

గన్నవరంలో బాబుకు ఘనస్వాగతం

సిఎం..సిఎం అంటూ కార్యకర్తల నినాదాలు

విజయవాడ,జూన్1(ప్రజా మంటలు):

హైదరాబాద్ నుంచి విజయవాడ విమానాశ్రయానికి చేరుకున్న తెదేపా అధినేత చంద్రబాబుకు పార్టీ నేతలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు తెలుగుదేశం కూటమికి అనుకూలంగా రావటంతో పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. సీఎం.. సీఎం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఎగ్జిట్ పోల్స్ ఫలితాల పట్ల సీనియర్ నేతలు దేవినేని ఉమా, యార్లగడ్డ వెంకట్రావు, కొల్లు రవీంద్ర, బోడె ప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్ తదితరులు సంతోషం వ్యక్తం చేశారు. అందరికీ అభివాదం చేస్తూ చంద్రబాబు..ఉండవల్లిలోని నివాసానికి బయలుదేరి వెళ్లారు. పోలింగ్ ముగిసిన తర్వాత విదేశీ పర్యటనకు వెళ్లిన చంద్రబాబు.. దాదాపు మూడు వారాల తర్వాత తిరిగి అమరావతి వచ్చారు. అటు.. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్ విద్యుత్ కాంతులతో ధగధగలాడుతోంది.

బిజెపి విషపాములాంటిది: కూనంనేని

గోదావరిఖని,జూన్1(ప్రజా మంటలు):
కేసీఆర్ ఓడిపోయి తప్పించుకున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. రాషట్రాన్ని అడ్డగోలుగా పాలించి అప్‌ఉల్లో ముంచారని మండిపడ్డారు. వీటికి బాధ్యత కెసిఆర్‌దే అన్నారు. గోదావరిఖని ఇల్లందు క్లబ్ లో జరిగిన ఏఐటీయూసీ కేంద్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ బతికి ఉండాలని కోరుకుంటున్నామన్నారు. ప్రభుత్వ లోగో పై బీఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ప్రజల ఆకాంక్షలు నెరవేరే విధంగా కొత్త ప్రభుత్వం పని చేయాలని సూచించారు. రాష్ట్రంలో ఏ రంగం సంతృప్తి కరంగా లేదన్నారు. పదేండ్లలో సింగరేణిని విచ్చలవిడిగా దోచుకున్నారని ఆరోపించారు. దేశానికి బీజేపీ అత్యంత ప్రమాదకారి అని, ఆ పార్టీ విషపూరితమైన పాము లాంటిదన్నారు. అధికారం కోసం మోదీ ఎంతటికైనా దిగజారుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ గెలుపులో కమ్యూనిస్టు పార్టీ భాగస్వామ్యం ఉందన్నారు. డబ్బులతో పని లేని ఎన్నికలు రావాలని కోరుకుంటున్నామని ఆయన చెప్పారు.

కూలిన నిర్మాణంలో ఉన్న భవనం స్లాబ్ కూలడంతో తప్పిన ముప్పు

హైదరాబాద్,జూన్1((ప్రజా మంటలు):

నిర్మాణంలో ఉన్న ఓ బిల్డింగ్ స్లాబ్ కుప్పకూలిన ఘటన రంగారెడ్డి జిల్లా మణికొండ మున్సిపాలిటీ పరిధిలో చోటుచేసుకుంది. జూన్ 1వ తేదీ శనివారం పుప్పాల్ గూడలోని అల్కాపూర్ రోడ్డు నెంబర్ 14లో నిర్మాణంలో ఉన్న బిల్డింగ్ స్లాబ్ ఒక్కసారిగా కుప్పకూలింది. స్లాబ్ వేస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటీ గాయాలు కకపోవడంతో తప్పిన పెను ప్రమాదం తప్పింది. బిల్డర్స్ నాసిరకమైన మెటిరియల్ వాడి స్లాబ్ వేస్తుండడంతో జరిగనట్లు తెలుస్తోంది. కుప్పకూలిన స్లాబ్ విడియోలు చిత్రికరించడానికి వెళ్లిన మీడియాపై యాజమాన్యం దాడికి యత్నించింది. ఇక్కడ ఏమీ కాలేదంటూ... ఇరువైపుల రోడ్డును అధికారులు మూసివేశారు. సేఫ్టీ ప్రికాషన్స్ పాటించకుండా కార్మికుల ప్రాణాలతో నిర్మాణ సంస్థలు చెలగాటం ఆడుతున్నాయంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు.

పివోకె విదేశీ భూభాగం

ఇస్లామాబాద్ హై కోర్టులో అంగీకరించిన పాక్

ఇస్లామాబాద్,జూన్1(ప్రజా మంటలు):
పాక్ ఆక్రమిత కశ్మీర్ విదేశీ భూభాగమని పాకిస్థాన్ ప్రభుత్వం ఇస్లామాబాద్ హై కోర్టులో అంగీకరించింది. అక్కడ పాకిస్థాన్ చట్టాలు చెల్లబోవని చెప్పింది. పాత్రికేయుడి కిడ్నాప్ కేసుపై శుక్రవారం విచారణ సందర్భంగా పాకిస్థాన్ అదనపు అటార్నీ జనరల్ ఇస్లామాబాద్ కోర్టులో ఈమేరకు వ్యాఖ్యానించారు. రావల్పిండిలోని తన ఇంట్లో ఉన్న అహ్మద్ ఫర్హద్ షా అనే పాత్రికేయుడిని పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ సంస్థ మే 15న కిడ్నాప్ చేసింది. దీనిపై ఆయన భార్య అక్కడి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ మోసిన్ అక్తర్ కయాని నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. అహ్మద్ ఫర్హద్‌ను కోర్టు ఎదుట ప్రవేశపెట్టాలని ఆదేశించింది. ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన అదనపు అటార్నీ జనరల్.. ప్రస్తుతం అహ్మద్ 'పీవోకే'లో పోలీస్ కస్టడీలో ఉన్నట్లు కోర్టుకు తెలిపారు. అది విదేశీ భూభాగమని, అక్కడ ప్రత్యేక రాజ్యాంగం, చట్టాలు ఉంటాయని, పాకిస్థాన్ చట్టాలు చెల్లబోవని చెప్పారు. అందువల్ల అతడిని కోర్టు ఎదుట ప్రవేశపెట్టడం కుదరదని వివరించారు. దీనిపై స్పందించిన జస్టిస్ కయానీ ఒకవేళ పీవోకే విదేశీ భూభాగమైతే.. పాకిస్థాన్ రేంజర్లు, పాక్ మిలటరీ ఎందుకు ఆ ప్రాంతంలోకి చొరబడుతున్నారని చురకలంటించింది. సామన్యులను విచారణ పేరుతో ఇంటెలిజెన్స్ సంస్థలు బలవంతంగా నిర్బంధించడాన్ని న్యాయస్థానం తప్పుబట్టింది. మరోవైపు పాక్ న్యాయవాది వ్యాఖ్యలతో భారత్‌కు మరింత బలం చేకూరినట్లయింది. 'పీవోకే' భారత్‌లో అంతర్భాగమని, అది 1947 నుంచి పాక్ ఆక్రమణలో ఉందని భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ ఎప్పటికప్పుడు చెబుతూనే ఉన్నారు. పీవోకే ఎప్పటికీ భారత్‌తోనే ఉంటుందని, అది భారత్‌లోనే ఉంటుందని వివిధ సందర్భాల్లో ఆయన నొక్కి చెప్పారు.



అన్నివర్గాల పోరాటంతోనే తెలంగాణ సాకారం

గత పదేళ్లుగా నియంతృత్వ పాలన సాగింది

ఇప్పుడు ప్రజాప్రభుత్వంలో స్వేచ్ఛ లభించింది

ఆవిర్భావ వేడుకలకు అందరికీ ఆహ్వానం

కెసిర్‌కు ప్రత్యేకంగా ఆహ్వానం అందించాం

పరేడ్‌గ్రండ్‌లో ఏర్పాట్లు పరిశీలించిన మంత్రులు

హైదరాబాద్,జూన్1 (ప్రజా మంటలు):
తెలంగాణ కోసం ఎన్నో వర్గాల ప్రజలు పోరాటం చేశారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. పరేడ్ గ్రౌండ్‌లో తెలంగాణ ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. తెలంగాణ వచ్చాక పదేళ్లు నియంతృత్వం కొనసాగిందని విమర్శించారు. ఇప్పుడు ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు. అమర వీరులను స్మరించుకుంటూ ఆవిర్భావ వేడుకలు జరుగుతాయని వివరించారు. రాజకీయాలకు అతీతంగా వేడుకలకు అందరినీ ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రధాని మోదీ ఎన్నోసార్లు తెలంగాణ ఏర్పాటును అవమానించారు. వేడుకలకు సోనియా గాంధీ వస్తారని ఆశిస్తున్నాం. గత ప్రభుత్వం తెలంగాణ వేడుకలకు కాంగ్రెస్ నేతలను ఆహ్వానించలేదు. రాష్ట్ర చిహ్నం రూపకల్పనలో భారాస ప్రభుత్వం ఎవరి అభిప్రాయాలు తీసుకోలేదని పొన్నం ప్రభాకర్ అన్నారు.తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు తమకు గత పదేళ్లలో ఒక్క ఆహ్వాన పత్రిక రాలేదన్నారు. తాము మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కూడా ఆహ్వానం పంపామన్నారు. తెలంగాణకు ఒక గీతం ఉండాలని ప్రజలు మార్పుకోరుకున్నారని చెప్పారు. తెలంగాణ చిహ్నంపై గతంలో ఎవరి అభిప్రాయాలను తీసుకోలేదని.. ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. రాజకీయంగా విమర్శలకు వేదిక కాదని చెప్పారు. ఆవిర్భావ వేడుకల్లో రాష్ట్ర గీతం ఆవిష్కరిస్తామన్నారు. అన్ని రాజకీయ పార్టీలు వేడుకలు జరుపుకోవాలన్నారు. తెలంగాణ అమరులను ప్రధాని నరేంద్ర మోడీ అవమానించారని విమర్శించారు. తల్లిని చంపి బిడ్డను తెచ్చుకున్నారని హేళన చేశారన్నారు. సోనియా తెలంగాణ ఇచ్చిన ప్రదాత.. సోనియా వస్తారనే నమ్మకం ఉందన్నారు. జయ జయహే తెలంగాణ పాట తెలంగాణ సమాజాన్ని సంఘటితం చేసే శక్తిగా అభివర్ణిం చారు మంత్రి జూపల్లి కృష్ణారావు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వందలాది బిడ్డలు ప్రాణాలు అర్పించారని చెప్పారు. గొప్ప తెలంగాణ ఏర్పడాలని అమర వీరులు కోరుకున్నారు. అమరవీరుల ఆకాంక్షలకు భిన్నంగా పాలన కొన సాగుతోందన్నారు.. బీజేపీ, బీఆర్ఎస్ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇకపోతే తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంత్రులు పొన్నం, జూపల్లి కృష్ణారావు తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అలుపెరుగని పోరాటాలు, బలిదానాలతో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నామని ఈ సందర్భంగా వారు చేసిన సేవలను వారు గుర్తు చేశారు. మంత్రులు వెంట ఎమమెల్యే దానం నాగేందనర్ కూడా ఉన్నారు.

తెలంగాణ చిహ్నంలో చార్మినార్ తొలగించాల్సిందే

మేం ఇందుకు ఎప్పుడూ పోరాడుతూనే ఉంటాం

బిజెపి జాతీయ కార్యదర్శి బండి సంజయ్

న్యూఢిల్లీ,జూన్1 (ప్రజా మంటలు):
తెలంగాణ రాష్ట్ర చిహ్నంలో చార్మినార్‌ను తొలగించాలని అప్పుడు, ఇప్పుడు తమ పార్టీ పోరాడుతునే ఉందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంగనర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. రాష్ట్ర చిహ్నంలో అమరవీరుల స్థూపం ఉండటం మంచిదని.. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందరి అభిప్రాయం తీసుకోవాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఢిల్లీ వేదికగా శుక్రవారం బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ... ఉద్యమంలో అసువులు బాసిన అమరులు, ఉద్యమకారులకు ధన్యవాదాలు తెలిపారు. ఏఐసీసీ అగ్రనేత సోనియా గాంధీని తెలంగాణ ఉత్సవాలకు ఆహ్వానించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీజేపీ నాయకులకు ఎందుకు ఆహ్వానం ఇవ్వలేదని ప్రశ్నించారు. ఇచ్చిన మాట సోనియా వెనక్కి తీసుకోవడం వల్లే ఆత్మహత్యలు జరిగాయన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌ను వెతికి మరి ఆహ్వానం ఇచ్చి ప్రేమ ఒలకబోసిన రేవంత్‌కు , తెలంగాణకు మద్దతిచ్చిన బీజేపీని ఎందుకు వేడుకలకు పిలవడం లేదని నిలదీశారు. సోనియా, కేసీఆర్ ఒకే వేదిక పంచుకునేలా రేవంత్ ఎత్తుగడ వేశారని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్‌లో బయటపడేందుకు కేసీఆర్ , కాంగ్రెస్‌ను అన్ని రకాలా లోబరుచుకున్నారని ఆరోపించారు. ఈ కేసు విషయంలో కేసీఆర్‌కి ఎందుకు నోటీసులు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో అధికారులు కేసీఆర్ పేరు చెప్పారని.. మరీ ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు. కాళేశ్వరం కేసు, ఫోన్ ట్యాపింగ్?పై రేవంత్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. అందుకే ఈ కేసుల దర్యాప్తు సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. కేంద్రం దర్యాప్తు చేస్తే, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్టు ఎలా జరిగిందో చూశారని అన్నారు. ఏఐసీసీకి తెలంగాణ ఒక ఏటీఎంగా మారిందని విమర్శించారు. నీళ్లు, నిధులు, ఉద్యోగాలను నిర్వీర్యం చేసిన మూర్ఖుడు కేసీఆర్ అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు. తెలంగాణలో అందరి బతుకులను కేసీఆర్ నిర్వీర్యం చేశారని బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు దూరంగా సోనియా గాంధీ?

న్యూఢిల్లీ,జూన్1 (ప్రజా మంటలు):
రాష్ట్ర అవతరణ వేడుకలకు సోనియా గాంధీ వచ్చే అవకాశం లేనట్లు తెలుస్తోంది. ఆరోగ్య సమస్యల కారణంగా సోనియా గాంధీ రాలేకపోవచ్చని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. మే 28న ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి సోనియా గాంధీని వేడుకలకు రావాలని ఆహ్వానించారు. ఏఐసీసీ సోనియా గాంధీ ఆవిర్భావ వేడుకలకు హాజరవుతారని తెలిపింది. అంతలోనే వేడుకలకు సోనియా రావడం లేదంటూ కాంగ్రెస్ వర్గాల నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందినట్లు తెలుస్తోంది. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇదిలా ఉంటే రాష్ట్ర వేడుకలకు విద్యావేత్తలు, ఉద్యమకారులతో పాటు వివిధ వర్గాల వారికి ఆహ్వానం అందించారు.

జూన్ 2న జరిగే ఆవిర్భావ వేడుకలకు ప్రభుత్వం ఏర్పాట్లను పూర్తి చేసింది. ఈ నేపథ్యంలోనే చార్మినార్, ట్యాంక్ బండ్, సచివాలయం, అమర జ్యోతి స్థూపం, గోల్కొండ తో పాటు వివిధ పర్యాటక ప్రాంతాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆయా ప్రాంతాల్లో కట్టుదిట్టమై భద్రతా ఏర్పాట్లను చేయగా.. సీఎస్ శాంత కుమారి దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు.తెలంగాణ ఆవిర్భావ వేడుకల సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ప్రభుత్వంతో పాటు బీఆర్ఎస్ కూడా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలోనే ట్యాంక్ బండ్,సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ ప్రాంతాల్లో పలు కార్యక్రమాలను నిర్వహించనున్నారు. దీంతో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం అర్ధరాత్రి వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని.. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో

కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్‌పై తీర్పు

5వతేదీకి రిజర్వ్ చేయడంతో తప్పని నిరాశ

నేడు తీహార్ జైలుకు వెళ్లక తప్పని పరిస్థితి

న్యూఢిల్లీ,జూన్1 (ప్రజా మంటలు):
సుప్రీంకో గత నెలలో మంజూరు చేసిన మధ్యంతర బెయిలును పొడిగించాలంటూ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజీవ్రాల్ పెట్టుకున్న దరఖాస్తుపై తీర్పును ఢిల్లీ కోర్టు ఈనెల 5వ తేదీకి రిజర్వ్ చేసింది. దీంతో ఈనెల 2వ తేదీన తిరిగి తీహార్ జైలు అధికారుల ముందు కేజీవ్రాల్ లొంగిపోవడం అనివార్యం కానుంది. ఆరోగ్య కారణాలు, వైద్య పరీక్షల రీత్యా ముందస్తు బెయిలు గడువును పొడిగించాలంటూ కేజీవ్రాల్ చేసిన అభ్యర్థనతో విచారణ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విభేదించింది. తన ఆరోగ్యంపై ఆయన తప్పుడు ప్రకటనలు చేశారని కోర్టు దృష్టికి తెచ్చింది. తనను నిర్బంధంలోకి తీసుకున్నప్పటి నుంచి 6 కిలోల బరువు తగ్గానంటూ కేజీవ్రాల్ చేసిన 'పొలిటికల్ ÷–లకెయిమ్'లో నిజం లేదని పేర్కొంది. పైగా ఒక కిలో బరువు పెరిగారని తెలిపింది. వైద్య పరీక్షలు చేయించుకోవడానికి బదులు దేశవ్యాప్తంగా ఆయన పర్యటిస్తున్నారని కోర్టుకు విన్నవించింది. మధ్యంతర బెయిలును పొడిగించాలని కేజీవ్రాల్ కోరడంలో ఔచిత్యాన్ని కూడా ఈడీ ప్రశ్నించింది. రెగ్యులర్ బెయిల్ కోరే స్వేచ్ఛను సుప్రీం కోర్టు ఇచ్చిందే కానీ, మధ్యంతర బెయిల్‌ను పొడిగించమని కోరడానికి కాదని ఈడీ తరఫున కోర్టుకు హాజరైన అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు వాదించారు.

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై అటకెక్కించే కుట్రలు

సమగ్ర విచారణ జరగకుండా చేస్తున్నారు

సరిగ్గా విచారణ జరిగితే కేసీఆర్, కేటీఆర్ జైలుకే

విచారణ జరగకుండా ఢిల్లీ స్థాయిలో ఒత్తిళ్లు

బండి సంజయ్ లేఖ తీవ్ర ఆరోపణలు

హైదరాబాద్,జూన్1(ప్రజా మంటలు):
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బండి సంజయ్ లేఖ రాశారు. కాళేశ్వరం మాదిరిగానే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సమగ్ర విచారణ జరగకుండా అటకెక్కించే కుట్రలు జరుగుతున్నాయని అనుమానం వ్యక్తం చేశారు. ఈ రెండు అంశాలపై విచారణ జరిగితే కేసీఆర్, కేటీఆర్ జైలుకు వెళ్లక తప్పదన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఫోన్ ట్యాపింగ్ పై విచారణ జరగకుండా ఢిల్లీ స్థాయిలో ఒత్తిళ్లు వస్తున్నాయని తెలిపారు. భారీ ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు తమ ద్రుష్టికి వచ్చిందని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కారకులు కేసీఆర్, కేటీఆర్ లకు నోటీసులిచ్చి విచారిస్తే రాష్ట్ర దర్యాప్తు సంస్థల విశ్వసనీయత పెరిగేదన్నారు. ఆ పని చేయకపోవడంవల్లే సీబీఐ విచారణ కోరుతున్నామన్నారు. ఫోన్ ట్యాపింగ్ అత్యంత తీవ్రమైన నేరమన్నారు. ప్రజాప్రతినిధులకు రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ప్రసాదించిన హక్కులను కూడా ఫోన్ ట్యాపింగ్ తో కాలరాశారన్నారు. భార్యాభర్తలు మాట్లాడుకునే అంశాలను కూడా ట్యాపింగ్ చేసి వ్యక్తిగత జీవితాల్లోకి చొరబడ్డారన్నారు. ఫోన్ ట్యాపింగ్ తో వ్యాపారులు, బిల్డర్లు, పారిశ్రామికవేత్తలుసహా పలువురు సెలబ్రిటీలను బెదిరించి డబ్బులు వసూలు చేయడంతోపాటు తమ అవసరాలను తీర్చుకున్నారన్నారు. ఫోన్ ట్యాపింగ్ కోసం విదేశాల నుండి ప్రత్యేకంగా పరికరాలు తెప్పించారన్నారు. బీఆర్ఎస్ ఓడిపోయాక ఫోన్ ట్యాపింగ్ పరికరాల ధ్వంసం పేరుతో దేశ భద్రతకు, ఉగ్రవాదులకు సంబంధించిన కీలకమైన సమాచార డేటాను కూడా ధ్వంసం చేశారన్నారు. వ్యాపార సంస్థలు ప్రతిపక్షాలకు విరాళాలు ఇవ్వకుండా ఫోన్ ట్యాపింగ్ ను వాడుకున్నారన్నారు. ఫోన్ ట్యాపింగ్ ప్రధాన సూత్రధారి ప్రభాకర్ రావు అమెరికాలో తలదాచుకున్నా ఎందుకు స్వదేశానికి రప్పించలేకపోయారన్నారు. ఫోన్ ట్యాపింగ్ పై వాస్తవాలు నిగ్గు తేలాలంటే సీబీఐ, ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలు జోక్యం అనివార్యం అన్నారు. మీరే సీబీఐ విచారణ జరపాలని కేంద్రానికి లేఖ రాయండన్నారు. రాష్ట్రంలోకి సీబీఐ రాకుండా గత ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని కోరారు. ప్రతిపక్షాలపై సైబర్ దాడికి కారకుడైన మాజీ సీఎం కేసీఆర్, ఆయన కుమారుడు కేటీఆర్ లకు నోటీసులిచ్చి విచారణ జరిపి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి రాజ్యాంగ హక్కులనే ఉల్లంఘించిన కేసీఆర్ ను, కేటీఆర్ లు ఎమ్మెల్యే పదవులకు అనర్హులు అని తెలిపారు. తెలంగాణ శాసనసభా నాయకుడిగా ఉన్న మీరు కేసీఆర్, కేటీఆర్ లను అనర్హులుగా ప్రకటించే విషయంపై స్పీకర్ కు లేఖ రాయాలన్నారు.

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో ప్రతిఒక్కరు పాల్గొనాలి

వొడితల ప్రణవ్

జమ్మికుంట జూన్ 01 (ప్రజామంటలు):
జూన్ 2 తెలంగాణ ఏర్పడి 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలకు కాంగ్రెస్ కార్యకర్తలకు అందరికీ శుభాకాంక్షలు..ఈ ఉత్సవాలను దశాబ్ది ఉత్సవాలు గా ఘనంగా జరుపుకోవాలని కోరుతున్నాను. 10 సంవత్సరాల తరువాత ప్రజలు కోరుకున్న, ప్రజలు ఆకాంక్షించిన తెలంగాణ లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది..మీ ఆకాంక్షలకు అనుగుణంగా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుంది. తెలంగాణ వేడుకలు ప్రతి గ్రామాన కాంగ్రెస్ కార్యకర్తలు సంతోషంగా జరుపుకోవాలి. కాంగ్రెస్ శ్రేణులు తెలంగాణ లిడే ఉత్సవాల్లో ప్రతి కాంగ్రెస్ కార్యకర్తలు భాగస్వామ్యులు కావాలని హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ బాబు పిలుపునిచ్చారు.

తిరోగమన దిశలో కాంగ్రెస్ పాలన

అభివృద్ధిని పక్కదారి పట్టిస్తున్న ప్రభుత్వం

తెలంగాణ ఆవిర్భావం కాంగ్రెస్ దయాభిక్ష కాదు

తొలి,మలి దశల్లో పోరాడి సాధించిన ఘన చరిత్ర

తెలంగాణ ఉద్యమాన్ని రక్తసిక్తం చేసిన చరిత్ర కాంగ్రెస్‌ది

అందుకే మీరు నిర్వహించే ఉత్సవాల్లో మేము పాల్గొనం

సిఎం రేవంత్ రెడ్డికి మాజీ సిఎం కెసిఆర్ బహిరంగ లేఖ

హైదరాబాద్,జూన్1 (ప్రజా మంటలు):
తెలంగాణ అభివృద్ధి తిరోగమన దిశలో సాగిస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించే తెలంగాణ దశాబ్ది అవతరణ ఉత్సవాల్లో పాల్గనరాదని నిర్ణయించినట్లు మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ స్పష్టం చేశారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి భారాస అధినేత కేసీఆర్ 22 పేజీల సుదీర్ఘ లేఖ రాశారు. రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలకు రావాలని ఆహ్వానం పంపిన నేపథ్యంలో ప్రజల పక్షాన బహిరంగ లేఖ రాస్తున్నట్టు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ సుదీర్ఘ ప్రజా పోరాట ఫలితం.. అమరుల త్యాగాల పర్యవసానం. కానీ, కాంగ్రెస్ దయాభిక్షగా మీరు చేస్తున్న ప్రచారాన్ని నిరసిస్తున్నాను. 1969 నుంచి ఐదు దశాబ్దాలు, భిన్నదశలలో, భిన్నమార్గాలలో ఉద్యమ ప్రస్థానం సాగింది. తెలంగాణ ఉద్యమాన్ని కాంగ్రెస్ రక్తసిక్తం చేసిందనేది మీరు దాచేస్తే దాగని సత్యం. 1952 ముల్కీ ఉద్యమంలో సిటీ కాలేజీ విద్యార్థులపై కాల్పులు జరిపి నలుగురు విద్యార్థుల ప్రాణాలు పొట్టన పెట్టుకున్నది ఆదిగా.. కాంగ్రెస్ క్రూర చరిత్ర కొనసాగింది. తెలంగాణ దశాబ్ది ఉత్సవం ఒక ఉద్విగ్న, ఉత్తేజకరమైన సందర్భమే. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని తిరోగమన దిశగా తీసుకుపోతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతోన్న నేపథ్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉత్సవాల్లో కేసీఆర్ పాల్గొనడం సమంజసం కాదని భారాస, తెలంగాణ వాదుల అభిప్రాయంగా ఉందని కేసీఆర్ లేఖలో పేర్కొన్నారు. అందుకే రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే వేడుకల్లో బీఆర్ఎస్ పాల్గొనడం లేదని వెల్లడించారు. తెలంగాణ అస్తిత్వాన్ని అవమానిస్తున్న కాంగ్రెస్ పోకడలను నిరసిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర అవతరణ సుదీర్ఘ ప్రజా పోరాట ఫలితమని, అమరుల త్యాగాల పర్యవసానమనీ కాకుండా.. కాంగ్రెస్ దయాభిక్షగా ప్రచారం చేస్తున్న ఆ పార్టీ భావ దారిద్ర్యాన్ని నిరసిస్తున్నానని చెప్పారు. ఇకనైనా వైఖరిని మార్చుకుని సంక్షేమానికి పాటుపడాలని సూచించారు. తెలంగాణ తొలి దశ ఉద్యమంలో 369 మంది ముక్కుపచ్చలారని యువకులను కాల్చి చంపిన కాంగ్రెస్ దమననీతికి సాక్ష్యమే గన్‌పార్క్ అమరవీరుల స్థూపమని కేసీఆర్ తెలిపారు. ఆ స్థూపాన్ని కూడా ఆవిష్కరించుకోనివ్వకుండా అడ్డుపడిన కాంగ్రెస్ కర్కశత్వం తెలంగాణ చరిత్ర పుటల్లో నిలబడిపోయిందని అన్నారు. మలిదశ ఉద్యమంలోనూ వందలాది మంది యువకుల ప్రాణాలను బలిగొన్న పాపం నిశ్చయంగా కాంగ్రెస్ పార్టీదే అని తెలిపారు. తెలంగాణకు కాంగ్రెస్ చేసిన అన్యాయాన్ని సరిదిద్దడానికి జరిగిన చారిత్రాత్మక ప్రయత్నమే టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం అని చెప్పారు. పార్లమెంటరీ రాజకీయ పంథాలో, శాంతియుత మార్గంలో తెలంగాణ సాధన లక్ష్యంగా టీఆర్ఎస్ ఏర్పడటం తెలంగాణ ఉద్యమంలో మేలుమలుపు అని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డిపైనా ఆ లేఖలో కేసీఆర్ అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు జై తెలంగాణ అనే నినాదాన్ని పలకలేదని.. తెలంగాణ ప్రజలకు ప్రాణ సమానమైన జై తెలంగాణ నినాదాన్ని నోటినిండా పలకలేని మీ మానసిక వైకల్యాన్ని ప్రజలు ఆక్షేపిస్తున్నారని తెలిపారు. ఇక ముందైనా తెలంగాణ వ్యతిరేక మానసికత నుంచి బయటపడి జై తెలంగాణ అని నినదించే వివేకాన్ని తెలంగాణ సమాజం మీ నుంచి కోరుకుంటుందని చెప్పారు. ముఖ్యమంత్రి అయ్యి ఆరు నెలలవుతున్నా ఇప్పటివరకు తెలంగాణ అమరవీరుల స్థూపాన్ని సందర్శించకుండా, శ్రద్ధాంజలి ఘటించకుండా తెలంగాణ మనోభావాలను తీవ్రంగా గాయపరిచారని అన్నారు. మీ ప్రవర్తనతో, మీ పార్టీ ప్రవర్తనతో కాంగ్రెస్ ఇప్పటికీ మారలేదు.. ఇక మారదు.. ఇక ముందు మారే అవకాశం లేదని స్పష్టమవుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని తిరోగమన దిశగా తీసుకుపోతున్నది ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉత్సవాల్లో కేసీఆర్ పాల్గొనడం సమంజసం కాదని.. బీఆర్ఎస్ పార్టీతో సహా ఉద్యమకారులు, తెలంగాణ వాదులు అభిప్రాయంగా ఉందని కేసీఆర్ అన్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని అవమానిస్తున్న మీ వికృత పోకడలను నిరసిస్తూ.. మీరు నిర్వహించే దశాబ్ది ఉత్సవాల్లో బీఆర్ఎస్ పాల్గొనడం లేదని తెలియజేయడానికి విచారిస్తున్నామని అన్నారు. ఇక ముందైనా ఇటువంటి వైఖరిని మానుకొని నిజమైన ప్రగతి కోసం, సంక్షేమం కోసం ప్రయత్నిస్తారని, ఎన్నికల వాగ్దానాలన్నీ త్వరగానే నెరవేరుస్తారనీ ప్రజల మన్ననలు పొందుతారని ఆశిస్తున్నామని లేఖలో పేర్కొన్నారు.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com